అక్రమ నిర్మాణాలను ఆదిలోనే అడ్డుకోవాలి

- విలీన ప్రాంతాల అభివృద్ధికి కృషి
- ఖాళీ స్థలాల్లో నీటి నిల్వ లేకుండా పటిష్ఠ చర్యలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే 50ఏళ్లను దృష్టిలో పెట్టుకొని నగర అభివృద్ధికి కావాల్సిన రహదారులు, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు పక్కా ప్రణాళికలు (మిగతా 6వ పేజీలో)

అభయమొసగే ఆదిలక్ష్మి..


ఆదిలక్ష్మి అలంకారంలో లక్ష్మీతాయారు అమ్మవారు

- భద్రాద్రిలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- అమ్మవారికి పంచామృత స్నపనం
- ఆదిలక్ష్మిగా భక్తులకు దర్శనం
- ఆలయంలో సందడి
- నేడు సంతానలక్ష్మి అలంకారం

భద్రాచలం, సెప్టెంబరు 23 : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గల శ్రీ లక్ష్మీ తాయారు ఆలయంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రోత్సవ ప్రయుక్త విజయదశమిలో భాగంగా తొలి రోజున మంగళవారం అమ్మవారు ఆదిలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా లక్ష్మీతాయారు అమ్మవారు మూలవరులకు పంచామృతాలతో ప్రత్యేక స్నపనం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఆదిలక్ష్మి అలంకారం ధరింపజేసి.. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి సామూహికకుంకుమార్చన, విష్ణు సహస్ర నామ పారాయణం, బాలకాండ పారాయణాన్ని రామాయణ పారాయణదారులు ఎస్జీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు నిర్వహించారు. అలాగే చిత్రకూట మండపంలో శ్రీరామాయణ మహా పారాయణాన్ని నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించి అనంతరం పారాయణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆదిలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ (మిగతా 6వ పేజీలో)

సర్వత్రా ఉత్కంఠ





- 'స్థానిక' రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి
- అధికారికంగా వెల్లడించడమే తరువాయి..
- 'అవకాశం' కోసం ఆశావహుల ఎదురుచూపు

● ఖమ్మం జిల్లాలో
మొత్తం 20 జడ్పీటీసీలు, 20ఎంపీపీలు, 283 ఎంపీటీసీ స్థానాలున్నాయి. మొత్తం 571 గ్రామపంచాయతీలు, 5,214 వార్డులున్నాయి. ఇందులో 50శాతం మహిళలకు కూడా రిజర్వు అయ్యాయి. ఏజెన్సీలో ఉన్న స్థానిక సంస్థల పదవులను గిరిజనులకు రిజర్వు చేశారు.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..
471 పంచాయతీలు, 4,168 వార్డులు, 22 ఎంపీపీలు, 22 జడ్పీటీసీ స్థానాలు, 236ఎంపీటీసీ స్థానాలున్నాయి. వీటికి కూడా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయింది.

ఖమ్మం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయింది. అయితే దీనిపై అధికారిక ప్రకటనే మిగిలి ఉంది. ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల యంత్రాంగం జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లకు అనుగుణంగా కసరత్తు ముగించారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులకు ఆయా కులాల నిష్పత్తి మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో పాటు మహిళా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేశారు. ఇటీవల కుల గణన సర్వే జనాభాలెక్కల ఆధారంగా 42శాతం బీసీలకు కేటాయించగా, 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు రిజర్వేషన్ల కేటాయింపు పూర్తిచేశారు. అయితే ఇరు జిల్లాల అధికారులు అత్యంత రహస్యంగా చేసిన వడపోత అనంతరం తుది జాబితాను సిద్ధం చేశారు. కలెక్టర్ల నుంచి అనుమతి లభిస్తే అధికారికంగా రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉంది. అన్నిపదవులకు రిజర్వేషన్లు నిర్ణయించినా.. ఫైనల్‌గా పరిశీలించిన తర్వాత ఆమోదం లభించనుంది. అయితే రిజర్వేషన్ల కేటాయింపుల ప్రక్రియ పూర్తయినా అధికారులు మాత్రం గోప్యత పాటిస్తున్నారు. జడ్పీ ఛైర్మన్ పదవుల రిజర్వేషన్ ప్రక్రియపై హైదరాబాద్‌లో కసరత్తు జరుగుతున్నట్టు సమాచారం. రిజర్వేషన్ల సమాచారాన్ని లీక్ చేయొద్దని, అధికారికంగా చెప్పేవరకు గోప్యంగా ఉంచాలని, కాదని బహిర్గతం చేస్తే కఠిన చర్యలుంటాయని ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి హెచ్చరికలు అందిన్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్

అధికార కాంగ్రెస్‌పార్టీలో ప్రభుత్వ నియామక పదవులపై ఇప్పటి వరకు నాయకులు, కార్యకర్తలు కొండంత ఆశగా ఉన్నారు. అదిగో.. ఇదిగో పదవులంటూ 22నెలల కాలం గడిచింది. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లు కావస్తున్నా చాలామందికి నియామకపదవులు దక్కలేదు. దీంతో నిరాశతో ఉన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే తమ రాజకీయ భవిష్యత్‌కు ఈ పదవులు పునాదులు కాబోతున్నాయన్న ఆశల్లో ఉన్నారు. రిజర్వేషన్లు ఖరారుచేస్తే తమకున్న అవకాశాలకు అనుగుణంగా అధికార, విపక్ష పార్టీల కార్యకర్తలు, నాయకులు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల బరిలో దిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అధికారులు ప్రస్తుతానికి రిజర్వేషన్ల అంశాన్ని గోప్యంగా ఉంచడంతో రాజకీయపార్టీల నాయకులు, బరిలో ఉండాలనుకుంటున్న ఆశావహులు రిజర్వేషన్లపై కూపీ లాగే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తంగా కీలకమైన జడ్పీఛైర్మన్, ఎంపీపీ పదవుల రిజర్వేషన్లపైనే అందరి ఆసక్తి నెలకొంది.

మళ్లీ మొదటికి..

- ఏపీ నుంచి యథేచ్ఛగా ఇసుక వాహనాల రాక
- ఇటీవల లారీలు పట్టుబడటంతో వారం పాటు ఆగిన దందా
- గత రాత్రి మళ్లీ సత్తుపల్లికి చేరిన ఆంధ్రా లారీలు
- పట్టుకుంటున్నదెవరు? వదిలేస్తున్నదెవరు? అని సందేహాలు
- జిల్లా అధికారుల ఆదేశాలూ బేఖాతరు



సత్తుపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణాలోని ఇసుక రవాణా దందా మళ్లీ మొదటికొచ్చింది. సత్తుపల్లి నియోజకవర్గంలోకి అక్రమంగా రవాణా మళ్లీ మొదలైంది. ఇటీవల ఏపీలోని చింతలపూడిలో పెద్ద సంఖ్యలో ఆంధ్రా నుంచి తెలంగాణాకు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న లారీలను అక్కడి పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో వారం రోజుల పాటు ఆగిన రవాణా మళ్లీ యథేచ్ఛగా కొనసాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక, మట్టి అక్రమ రవాణాకు సంబంధించి ఇటీవల జిల్లా అధికారులు సమావేశమై అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించినా అడ్డూఅదుపు లేకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుండటంతో.. జిల్లా అధికారుల ఆదేశాలు కూడా బేఖాతరు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ ఇసుక, మట్టి రవాణాపై పత్రికలు, మీడియాలో కథనాలు వస్తున్నా పట్టించుకోకపోవటం పట్ల ఒక ఉన్నతాధికారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. అయినా సత్తుపల్లి నియోజకవర్గానికి ఆంధ్రా నుంచి ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుండటం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తాజాగా..

ఏపీలోని కొవ్వూరు సమీపంలోని ఇసుక క్వారీల నుంచి ఇసుక లారీలు సోమవారం రాత్రి సత్తుపల్లి నియోజకవర్గంలోకి కొన్ని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లి, గండుగులపల్లి ప్రాంతానికి చేరుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. సత్తుపల్లి పట్టణానికి ఆరు లారీల్లోనూ, దమ్మపేట మండలానికి రెండు (మిగతా 8వ పేజీలో)


నిరాహార దీక్షలో రామన్నగూడెం గ్రామ ఆదివాసీలు

పట్టాలిచ్చారు.. భూమిని మరిచారు!

- దశాబ్దాలుగా రామన్నగూడెం ఆదివాసీలకు దక్కని ప్రభుత్వ భూమి
- రెండు రోజులుగా మహిళలు, పిల్లలతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష
- అటవీ, రెవెన్యూ శాఖలు సర్వే చేసి భూమిని ఇవ్వాలని బాధితుల డిమాండ్

వివరాలు 6లో

కలెక్టరేట్‌లో ఘనంగా 'బతుకమ్మ'

ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్ అనుదీప్ దంపతులు



బతుకమ్మతో వస్తున్న కలెక్టర్ దంపతులు, బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ సతీమణి, డీఎంహెచ్‌వో, అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ సంబురాల్లో మూడోరోజైన మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మాధవి దంపతులు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరయ్యారు. కలెక్టర్, తన సతీమణి మాధవితో కలిసి బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. కలెక్టర్ సతీమణి కోలాట మాడుతూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే బతుకమ్మ, ప్రకృతిని పూజించే గొప్ప పండుగని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి కళావతీబాయి, ఎన్‌హెచ్‌ఎం డీపీఎం దుర్గ, మహిళా ప్రాంగణం విద్యార్థినులు, వైద్య శాఖ ఉద్యోగినులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రసాద్' పనులను పరిశీలించిన భద్రాద్రి ఈవో


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈవో

భద్రాచలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం కింద భద్రాచలంలో చేపడుతున్న రామాలయ అభివృద్ధి పనులను దేవస్థానం ఈవో దామోదర్‌రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మిథిలా స్టేడియం వెనుకభాగంలో నిర్మిస్తున్న భక్తుల వసతి గదుల సముదాయం, నిత్యాన్నదాన సత్రం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఈవో కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈవో వెంట ఆలయ సీసీ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

నాలుగు దిక్కులా.. ఆరోగ్యం పంచేలా!

- అందుబాటులోకి రానున్న అత్యవసర చికిత్సలు
- జిల్లాలో పూర్తయిన మూడు 100 పడకల ఆస్పత్రులు

వివరాలు 6లో..

పట్టారాయుళ్ల పట్టివేత

- వెలుగు చూసిన పట్టాదారు పాసు పుస్తకాల బాగోతం
- ఐదుగురు నిందితుల అరెస్టు
- రాష్ట్రవ్యాప్తంగా వసూళ్ల పర్వం
- తమ డబ్బును ఇప్పించాలని బాధితుల వేడుకోలు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై


స్వాధీనం చేసుకున్న నకిలీ పాస్ పుస్తకాలు

కూసుమంచి / బూర్గంపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నకిలీ పాస్‌పుస్తకాలు తయారు చేసి.. పలువురు రైతులను బురిడీ కొట్టించిన 'పట్టా'రాయుళ్ల బాగోతం కూసుమంచి మండలంలో వెలుగు చూసింది. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుని ఓ ముఠా పెద్ద ఎత్తున డబ్బును దండుకుంది. అయితే తనకు ఇచ్చిన పుస్తకం నకిలీదని గుర్తించిన బాధిత రైతు.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముఠా గుట్టు రట్టయ్యింది. ఈ మేరకు పోలీసులు మంగళవారం ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కూసుమంచి ఎస్సై నాగరాజు కథనం ప్రకారం..

జక్కేపల్లి గ్రామానికి చెందిన అంజిరెడ్డి అనే రైతు వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తనకున్న నాలుగెకరాల భూమికి పట్టా చేయిస్తామని కొందరు అతన్ని నమ్మబలికి.. డబ్బు తీసుకున్నారు. ఆ తర్వాత అంజిరెడ్డికి నకిలీ పాస్‌బుక్కులు అందజేశారు. అయితే వాటిని సదరు రైతు మీసేవలో చూసుకోగా.. ఎంతకూ కనిపించకపోవడంతో నకిలీ పుస్తకాలు అని గుర్తించాడు. దీంతో పోలీసులను ఆశ్రయించగా.. వారు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించి ఖమ్మం జిల్లాతో పాటు అంతర్‌జిల్లాలకు చెందిన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం ఒప్పుకున్నారు. పట్టుబడిన నిందితులలో కూసుమంచి మండలం జక్కేపల్లికి చెందిన కొత్త జీవన్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా గార్ల బయ్యారం గార్లబయ్యారం గ్రామానికి చెందిన కొండూరు కార్తీక్, భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచకు చెందిన పారిపత్తి సాయి కుశాల్, లక్ష్మీదేవిపల్లికి చెందిన జక్కపల్లి వరప్రసాద్, సారపాకకు చెందిన నందమూరి లక్ష్మణ్‌రావును పోలీసులు అరెస్ట్ చేశారు. అదేవిధంగా టీఎస్28కే 8811 నెంబరు గల మహీంద్రా కారు, టీజీ28 3779 ఎర్టిగా కారుతో పాటు వారు తయారు చేసిన 10 పట్టాదారు పాస్‌పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. దీని పై పూర్తిస్థాయిలో.. మరింత లోతుగా విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పిస్తామంటూ వచ్చే ముఠాలను రైతులు నమ్మొద్దని కోరారు. అలాంటి వారు ఎవరైనా వస్తే తమకు ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా వసూళ్ల పర్వం..

ఇదిలా ఉండగా నిందితులు జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఘట్‌కేసర్, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్‌తో పాటు మరికొన్ని జిల్లాల్లో రైతుల వద్ద పాస్‌పుస్తకాలు ఇప్పిస్తామని పెద్ద మొత్తంలో అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు తెలిసింది. భూమి విలువను బట్టి సుమారు రూ.5లక్షల నుంచి రూ.10కోట్ల వరకు వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. పట్టుబడ్డ నిందితుల్లో ఒకరు యూట్యూబ్ బాధ్యతలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. బయ్యారంలో కలర్ జిరాక్స్ మిషన్లను, పాల్వంచలో ప్రింటింగ్ మిషన్లను ఏర్పాటు చేసుకుని దందా చేసినట్లు తెలిసింది. కాగా.. దోచుకున్న డబ్బును నిందితుల నుంచి రికవరీ చేసి ఇప్పించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

40 వసంతాల అపూర్వ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వవిద్యార్థులు

వైరా, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1984-85 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాలలో అపూర్వ ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. 40 మంది పూర్వవిద్యార్థులు కలుసుకొని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నాటి గురువులు జయలక్ష్మి, షేక్.వలీజాన్, తుమ్మా వీరభద్రరావు, ప్రకాశరావు, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు దొంతెబోయిన సత్యనారాయణ, అప్పటి జూనియర్ అసిస్టెంట్ రిటైర్డ్ ఎంపీడీవో అయిన వెంకటేశ్వరరావులను సన్మానించారు. ఆటపాటలు, బతుకమ్మలతో ఉల్లాసంగా గడిపారు. తమ సహచర పూర్వ విద్యార్థి కొండయ్యకు రూ.25వేలకుపైగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రుద్రాక్షల నర్సింహాచారి, వాకదాని బాబూరావు, గడిపూడి రామకృష్ణ, అయిలూరి శ్రీనివాసరెడ్డి(గరికపాడు), అయిలూరి శ్రీనివాసరెడ్డి(దాచాపురం), కె.రతిలుమాంబ, వల్లభనేని శ్రీనివాసగాంధీ, ఊటుకూరి కృష్ణకుమారి, వనమా నాగమణి, అరుణ, నాగరాజు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తెలంగాణ అండర్-15 మహిళా క్రికెట్ జట్టుకు

తాటిగూడెం యువతి ఎంపిక

కరకగూడెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మారుమూల ఏజెన్సీ ప్రాంతం నుంచి తెలంగాణ అండర్-15 మహిళా క్రికెట్ ప్రాబబుల్ జట్టుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం తాటిగూడెం పంచాయతీ విప్పచెట్టు గుంపునకు చెందిన రామటెంకి దేవి ప్రియ ఎంపిక అయింది. దేవి ప్రియ తండ్రి హనుమంతరావుకు క్రికెట్ అంటే చాలా ఇష్టంతో క్రికెట్ ఆడుతూ పట్టుదలతో పోటీ పరీక్షల్లో సత్తా చాటి ఉపాధ్యాయుడు అయ్యాడు. తనకున్న క్రికెట్ మక్కువతో తన కూతురును క్రికెట్‌లో పంపించాలని దేవి ప్రియకు క్రికెట్‌పై ఆసక్తి పెంచాడు. హైదరాబాద్‌లో మేడ్చల్ శ్రీ విద్యానికేత హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న దేవి పట్టుదలతో తెలంగాణ అండర్-15 మహిళా క్రికెట్ ప్రాబబుల్ జట్టుకు ఎంపిక అయింది. హైదరాబాద్‌లో నిర్వహించిన మహిళా క్రికెట్ అండర్- 15 సెలక్షన్‌లో దేవి ప్రియ ఎంపిక కావడంతో హెడ్ కోచ్ సురేందర్‌రెడ్డి, కోచ్‌లు వెంకట్ యాదవ్, బుచ్చిబాబు, రంజి, ఇర్ఫాన్‌లు ప్రత్యేకంగా అభినందించారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతం నుంచి రాష్ట్ర స్థాయిలో ఎంపిక అయిన దేవి ప్రియను మండల ప్రజలు అభినందించారు.



మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన దేవి ప్రియ

ఏఐఆర్టీడబ్ల్యూఎస్ (సీఐటీయూ)

రాష్ట్ర కమిటీలో ముగ్గురికి చోటు

ఖమ్మం అర్బన్ సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్, ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీలోకి జిల్లాకు చెందిన ముగ్గురికి కీలక పదవులు దక్కాయి. ఈనెల 20,21తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సీపీఎం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్‌తోపాటు రాష్ట్ర కోశాధికారిగా జిల్లా ఉపేందర్‌ను, రాష్ట్ర కార్యదర్శిగా రామదాసును ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన నేతలకు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మా విష్ణువర్దన్, కళ్యాణం వెంకటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలియజేశారు.

నాలుగు దిక్కులా ..

ఆరోగ్యం పంచేలా..!

» అందుబాటులోకి రానున్న అత్యవసర చికిత్సలు » జిల్లాలో పూర్తయిన మూడు 100 పడకల ఆస్పత్రులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లాలో ప్రజలకు ఆరోగ్యాన్ని పంచేలా నాలుగు దిక్కులా 100 పడకల ఆస్పత్రులను నిర్మిస్తున్నారు. దాదాపు అవన్నీ పూర్తి కావచ్చాయి. త్వరలో అన్ని చోట్ల వైద్యసేవలను అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సత్తుపల్లి, మధిర, కల్లూరు. ఆస్పత్రులు ఇప్పటికే పూర్తి కాగా వైరా ఆస్పత్రి నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో వీటి పరిధిలో 100 చొప్పున పడకలు అందుబాటులోకి రానున్నాయి. 24 గంటల పాటు వైద్యసేవలు అందించే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేయగా, ఇవి దాదాపు పూర్తి కావచ్చాయి. జిల్లాకు చెందిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరావు ప్రత్యేక కృషితో వీటిని సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. సత్తుపల్లి, కల్లూరు, మధిర లాంటి ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర సమయంలో ఈ ఆస్పత్రుల్లో సేవలు బాధితులకు చికిత్సలు అందుబాటులోకి రానున్నాయి.

సత్తుపల్లి ఏరియా ఆస్పత్రి

ప్రస్తుతం 50 పడకలతో ఉంది. దీన్ని 100 పడకలుగా ఉన్నతి కల్పించారు. 77,043 మందికి వైద్యసేవలు ఇక్కడ అందనున్నాయి. 5 ఎకరాల స్థలంలో 94,002 చదరపు అడుగుల్లో భవనాన్ని నిర్మించారు. రూ.34కోట్లతో భవనాన్ని పూర్తి చేశారు. రూ.28.69 లక్షలు భవన నిర్మాణానికి మిగిలిన డబ్బులను ఆస్పత్రి పరికరాలకు వినియోగించనున్నారు. ఆప్తమాలజీ, జనరల్ సర్జర్, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పీడియాట్రీషిన్, ఆర్థో, అనస్తీషియా, ఎంబీబీఎస్, డెంటల్ సేవలు అందుబాటులోకి వస్తాయి.





పూర్తయిన కల్లూరు సీహెచ్‌సీ, మధిర ఏరియా ఆస్పత్రి భవనాలు

మధిర ఏరియా ఆస్పత్రి

ప్రస్తుతం 30 పడకలతో కొనసాగుతోంది. 100 పడకలుగా స్థాయి పెంచారు. 68,548 మంది ప్రజలకు సేవలు అందించనుంది. 5 ఎకరాల స్థలంలో 94,002 చదరపు అడుగుల్లో భవనాన్ని నిర్మించారు. పూర్తి అయ్యింది. రూ. 34 కోట్లు మంజూరు కాగా రూ.29.94 కోట్లు వెచ్చించారు. మిగిలిన సొమ్ము ఆస్పత్రి పరికరాలకు వినియోగించనున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, గైనకాలజీ, డెంటల్, రేడియాలజీ, పిడియాట్రీషియన్, ఆర్థో, ఎంబీబీఎస్ సేవలు ఇక్కడ అందుబాటులోకి రానున్నాయి.

కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్

ప్రస్తుతం 30 పడకలున్నాయి. దీన్ని 50 పడకల స్థాయిని పెంచారు. 63,828 మంది ప్రజలకు సేవలు అందనుంది. 6.40 ఎకరాల్లో నిర్మించారు. 25,333 చదరపు అడుగుల్లో భవనాన్ని నిర్మించారు. రూ.10.50 కోట్లు నిధులు కేటాయించారు. రూ.7.86 కోట్లు ఖర్చుచేశారు. మిగిలిన నిధులతో పరికరాలను సమకూర్చనున్నారు. జనరల్ సర్జన్ సేవలు ఇక్కడ అందుబాటులోకి రానున్నాయి.

ఏరియా ఆస్పత్రి వైరా

దీనికి కూడా 100 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. రూ.37.50 కోట్లు కేటాయించారు. భవనం నిర్మాణంలో ఉంది. వీటితో పాటు నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఏరియా ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నారు. సీహెచ్‌సీ పెనుబల్లి, ఎర్రుపాలెం ఆస్పత్రులను కూడా 50 పడకల స్థాయికి పెంచి వీటికి రూ ఒక్కోదానికి రూ. 7.50 కోట్లు కేటాయించారు. ముదిగొండ, కూసుమంచి పీహెచ్‌సీలను కూడా ప్రత్యేక నిధులతో ఏరియా ఆస్పత్రిగా 100 పడకలతో అభివృద్ధి చేస్తున్నారు. దీంతో జిల్లాలో నలు దిక్కులా ఆస్పత్రులతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి.

ఆస్పత్రుల ప్రారంభానికి అన్నీ సిద్ధం చేశాం

● డాక్టర్ రాజశేఖర్ గౌడ్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి



జిల్లాలో అన్ని నాలుగు దిక్కులా ఆస్పత్రుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రారంభానికి సిద్ధం చేయగా కొన్ని నిర్మాణంలో ఉన్నాయి. వీటి పనులను పర్యవేక్షిస్తున్నాం. సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు సేవలు అందేలా కృషిచేస్తున్నాం. జిల్లా మంత్రులు వీటిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సూచనలు చేస్తున్నారు. మంత్రుల ఆదేశాల ప్రకారం పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసేందుకు కృషిచేస్తున్నాం.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదాం

» కల్లుగీత కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మం అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా ఉద్యమించాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.. మంగళవారం ఖమ్మంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కల్లుగీత కార్మిక సంఘానికి సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. బొమ్మగాని భిక్షం ఆధ్వర్యంలో ఏర్పడిన సంఘం గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తుందన్నారు. మహాసభలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూ గౌడ్, జిల్లా గౌరవసలహాదారు మెరుగు సత్యనారాయణ, వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ ఎర్ర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం

జిల్లా, అధ్యక్ష కార్యదర్శులుగా సుదర్శన్, కరుణాకర్



సుదర్శన్, కరుణాకర్

కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బోడపట్ల సుదర్శన్, కొండం కరుణాకర్ ఎన్నికయ్యారు. మంగళవారం ఖమ్మంలోని ప్రజాసంఘాల భవనంలో జరిగిన కల్లుగీత కార్మిక సంఘం జిల్లా 14వ మహాసభ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రెడ్డిమల్ల వెంకటయ్య, మొక్కనాగేశ్వరరావు, బోడపట్ల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా మరికంటి శ్రీనివాసరావు, బత్తిని ఉపేందర్, ముత్యం రామకృష్ణ, తోపాటు 24 మంది సభ్యులను ఎన్నుకున్నారు..

అక్రమ నిర్మాణాలను ఆదిలోనే అడ్డుకోవాలి

(5వ పేజీ తరువాయి)

చేశామని, అయితే అధికారులు అక్రమ నిర్మాణాలపై దృష్టి పెట్టి ఆదినుంచే వాటిని అడ్డుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం నగరంలోని 6వ డివిజన్‌లో రూ.1.50కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపడుతున్నామని, అందుకు పక్కా కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. ఖాళీ స్థలాల యజమానులు బాధ్యతగా వ్యవహరించి ఖమ్మం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహకరించాలని కోరారు. స్థలాల యజమానులు ముందుకు రాకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కమిషనర్ అభిషేక్ అగస్త్యను ఆదేశించారు. నగరంలో భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని రహదారులు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను నిర్వహిస్తున్నామని, విలీన ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కావాల్సిన మేరకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని, తద్వారా భూగర్భ జలాలు పెరిగి.. వేసవిలో నీటి ఎద్దడి రాదన్నారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని ఖమ్మం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు తెప్పిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఏఎంసీ ఛైర్మన్ యరగర్ల హనుమంతరావు, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, ఈఈ కృష్ణలాల్, తదితరులు పాల్గొన్నారు.

తల్లడిల్లిన తల్లిప్రాణం

» కళ్లముందే కానరాని లోకాలకు కన్నపేగు
» కారు ఢీకొనడంతో లేగదూడ దుర్మరణం
» హిందూ సంప్రదాయ పద్ధతిలో ఖననం చేసిన జంతు ప్రేమికులు

భద్రాచలం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అప్పటి వరకు తనకు పుట్టిన లేగదూడను ముద్దాడుతూ తల్లి ఆవు లాలించింది. వారం రోజుల క్రితం జన్మించిన లేగదూడ భద్రాచలంలోని యూబీ రోడ్డు చౌరస్తాలో కారు ఢీకొట్టడంతో మృతి చెందింది. దీంతో తల్లడిల్లిన ఆ లేగదూడ తల్లి హృదయ విదారకంగా మృతి చెందిన దూడను ముద్దాడుతూ లేపేందుకు ప్రయత్నించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. ఆ సమయంలో జంతు ప్రేమికుడు ఎలిపే ఉదయ్‌కుమార్ లేగదూడ మృతిపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం లేగదూడను తన వాహనంలో ఉంచగా తన బిడ్డ ఎక్కడికి వెళ్లిందో తెలియక తల్లి ఆవు అటూ ఇటూ తిరుగుతూ అరుస్తూ ఆవేదన చెందుతూ ఆ పరిసరాల్లోనే సంచరించింది. ప్రమాదంలో మృతి చెందన బిడ్డ కోసం తల్లి ఆవు రోధించిన తీరును చూసిన స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా మృతి చెందిన లేగదూడకు పశువైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. కారు ప్రమాదంలో లేగదూడ మృతిపై జంతు ప్రేమికులు ఇచ్చిన ఫిర్యాదు క్రమంలో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి 11 గంటల వరకు ఆవు సంఘటనా స్థలంలోనే ఉంది.







బతికి ఉన్న సమయంలో లేగదూడను ముద్దాడుతున్న తల్లి ఆవు, మృతి చెందిన లేగదూడ వద్ద దీనంగా తల్లి ఆవు

పట్టాలిచ్చారు.. భూమిని మరిచారు

» దశాబ్దాలుగా రామన్నగూడెం ఆదివాసీలకు దక్కని ప్రభుత్వ భూమి
» రెండు రోజులుగా చంటి పిల్లలతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష
» అటవీ, రెవెన్యూ శాఖలు సర్వే చేసి భూమినివ్వాలని డిమాండ్

కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తమకు పట్టాపాస్ పుస్తకాలు ఇచ్చి దశబ్దాలవుతున్నా ఇంతవరకు భూమిని అప్పగించలేదంటూ అశ్వారావుపేట నియోజకవర్గం పరిధిలోని రామన్నగూడెం గిరిజనులు చంటి పిల్లలతో కలిసి కలెక్టరేట్ వద్ద రెండురోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రామన్నగూడెం ఆదివాసీలు మాట్లాడుతూ తమది ఆత్మగౌరవ నిరవధిక నిరాహార దీక్ష అని, గతంలో అనేకసార్లు అధికారులకు వినతిపత్రం అందజేసినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో తాము ఈ దీక్షకు దిగామని పేర్కొంటున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం వివాదానికి సంబంధించిన వివరాలివీ.. రామన్నగూడెం గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 30,36,39కు సంబంధించి గతంలో కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు, 2017లో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం జాయింట్ సర్వే నిర్వహించి పంచనామ చేసి భూములను తమకు అప్పగించాలని ఆదేశించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఈ నెల 18వ తేదీన ఆర్డీవో వచ్చి సర్వే చేస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు అమలు జరగలేదని వారు తెలిపారు. 1981, 1986, 1990, 1992, 1994, 1998 సంవత్సరాల్లో ప్రభుత్వం రామన్నగూడెం ఆదివాసులకు సుమారు 500 ఎకరాల రెవెన్యూ భూమికి సంబంధించి ఫైనల్ పట్టాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశారని, అప్పటి నుంచి తాము భూమి శిస్తులను కూడా ప్రభుత్వానికి చెల్లించామన్నారు. ఆ తర్వాత కొన్నేళ్లకు ఇదే సర్వే నెంబర్లు గల భూములు తమవని అటవీ శాఖ వారు భయపెట్టి ఆక్రమించుకున్నారని, దీనిపై జిల్లా అధికారులు, ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌కు అనేక సార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రెవెన్యూ, అటవీశాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించి ఆ భూములను తమకు అప్పగించాలని, గతంలో చేసిన సర్వే నివేదికలను బయటపెట్టాలని, తమను ఇబ్బందులకు గురిచేస్తున్న అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, అంకమ్మ చెరువు వరద కాలువ నష్ట పరిహారం 2013లో భూ సేకరణ ప్రకారం మంజూరు చేసే ఆదివాసీ రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. గిరిజనుల నిరాహార దీక్షకు మడకం నాగేశ్వరరావు, మాడి సీతారాముడు, కుర్సా శ్రీను, మిడియం రమాదేవి తదితరులు నాయకత్వం వహించారు. మంగళవారం నాడు నిరాహార దీక్ష చేస్తున్న ఆదివాసీలకు సంఘీభావం తెలిపారు. ఆదివాసీల భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని, అశ్వారావుపేట మాజీ జడ్పీటీసీ బేతి సాంబశివరావు, మాజీ సర్పంచ్ పొట్ట రాజులు డిమాండ్ చేశారు. అనంతరం దీక్ష చేస్తున్న వారికి పండ్లు పంపిణీ చేశారు.



దీక్ష శిబిరంలోనే తమ పిల్లలకు అన్నం తినిపిస్తున్న రామన్నగూడెం గ్రామ మహిళలు

ఖజానా కళాకారుల గ్రంథావిష్కరణ

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ట్రెజరీ, అకౌంట్స్ శాఖలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఈరోజు వరకు వృత్తితో పాటు ప్రవృత్తిలో భాగంగా అనేకమంది వివిధ కళలలో రాణిస్తున్నారు. అలాంటి వారి ప్రతిభ ఆధారంగా వారు సాధించిన విజయాలను తెలియజేస్తూ ఖమ్మం జిల్లా ఖజనాశాఖ అధికారం వెంటపల్లి సత్యనారాయణ రూపొందించిన "ఖజానాలో కళాకారులు" అనే గ్రంథాన్ని ట్రెజరీస్ అకౌంట్స్ రాష్ట్ర డైరెక్టర్ కేఎస్సార్సీ మూర్తి ఆవిష్కరించారు. ఖమ్మం, మహబూబాబాద్ రెండు జిల్లాల ఖజానా డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణ రచించిన ఈ గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎందరో ఉద్యోగ కళాకారుల వివరాలు క్రోడీకరించి ఇలాంటి గ్రంథాన్ని రచించడం రూపొందించడం పట్ల వెంటపల్లి సత్యనారాయణను అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ నాగరాజు, ఖమ్మం జిల్లా టీజీవో కార్యదర్శి మోదుగు వేలాద్రి, సుధీర్ బాబు, షాబుద్దీన్, నరసింహచారి, పర్వతాలు, రాజగోపాలచారి, రవీంద్ర గౌడ్, లావణ్య, రాధా, మహమ్మద్ రఫీ, జయరాం, దస్రు, వెంకటేశ్వర్లు శ్రీనివాస్ ప్రసన్నకుమార్ అమృత సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ట్రెజరీ అకౌంట్స్ డైరెక్టర్ కెఎస్సార్సీ మూర్తి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

నేలకొండపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకుడు రోడ్డుప్రమాదంలో దుర్మరణం పాలైన సంఘటన మంగళవారం రాత్రి నేలకొండపల్లి సమీపంలోని కొరటేను వద్ద జరిగింది. నేలకొండపల్లి మండలం కోరట్లగూడెం గ్రామానికి చెందిన బచ్చలకూరి మనోజ్(18) నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన మీసాల సన్నీప్రసాద్(17) పదో తరగతి వరకు చదివి, ప్రస్తుతం మెకానిక్‌గా నేలకొండపల్లిలో పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి మనోజ్, సన్నీప్రసాద్ ఇద్దరూ నేలకొండపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై కొరట్లగూడెం వెళుతుండగా.. నేలకొండపల్లి సమీపంలోని కొరటేను (గుట్టలప్రాంతం) వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మనోజ్, సన్నీప్రసాద్ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఎదురుగా వచ్చి ఢీ కొట్టిన ద్విచక్రవాహనదారుడిది తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు మృతుల తల్లిదండ్రులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.



మనోజ్, ప్రసాద్ మృతదేహాలు

అన్నారంతండాలో ఉద్రిక్తత

చంద్రుగొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చంద్రుగొండ మండలం అన్నారం తండా వద్ద సోమవారం ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో గాయాలపాలై మతి చెందిన మొగిలిపువ్వ నాగరాజు మృతదేహంతో కుటుంబ సభ్యులు పరిహారం కోరుతూ మంగళవారం రాత్రి అన్నారంతండాలో ట్రాక్టర్ యజమాని ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. దాంతో స్థానిక పోలీసులు గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను ఆందోళన విరమించే ప్రయత్నం చేశారు.

ఈ సమయంలో గ్రా మంలో కొంత ఉద్రిక్తత ఏర్పడింది. డీఎస్పీ రెహమాన్ అన్నారం తండాకు చేరుకొని మృ తుడి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

అభయమొసగే ఆదిలక్ష్మి..

(5వ పేజీ తరువాయి)

ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఏఈవో శ్రవణ్‌కుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేశ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే గోశాలకు హైదరాబాద్‌లోని భవానీనగర్ కాలనీకి చెందిన అల్లు వెంకట ఫణికిరణ్ కుటుంబ సభ్యులు రూ.1,01,116లు విరాళంగా అందజేశారు.

నేడు సంతానలక్ష్మీగా...

రామాలయంలో వేంచేసి ఉన్న లక్ష్మీతాయారు అమ్మవారు నేడు సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అఖిల జగన్నాత్మరం, అస్మన్మాతరం. అంటూ ప్రార్థిస్తారు భగవద్ రామానుజులు. సకల చరాచర జగత్తు అంతా ఆ అమ్మ సంతానమే. అందుకే ఆమెకు సంతానలక్ష్మి అని పేరు. ఈ రూపంలో ఉన్న అమ్మను ఆరాధిస్తే సంతానానికి సంబంధించిన అవరోధాలన్ని తొలగి సత్సంతానం, సుఖశాంతులు కలుగుతాయని శాస్త్రం. మన అందరి అభీష్టాలను నెరవేర్చడానికై నేడు సంతానలక్ష్మి అలంకారలో అమ్మవారు దర్శనమిస్తున్నారు.

రహదారులు, నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించాలని వినతి

» కేంద్రానికి మాజీ మంత్రి జలగం లేఖకి స్పందించిన ప్రధానమంత్రి కార్యాలయం
» పరిశీలించాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ ఈఎన్‌సీకి లేఖ

భద్రాచలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని మల్కనగిరి నుంచి పాండురంగాపురం వరకు కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న రైల్వే లైన్‌కు ఇరువైపులా నీటిపారుదల ప్రాజెక్టులు, రోడ్లు నిర్మించాలని ఇటీవల ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి జలగం ప్రసాదరావు ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు లేఖ రాశారు. జలగం ప్రసాదరావు పేర్కొన్న అంశాలను నిశితంగా పరిశీలించాలని ప్రధాని కార్యాలయం నుంచి లేఖ రాశారు. అలాగే అవసరమైన ప్రాజెక్టు ప్రతిపాదనలు ఉంటే వాటిని చీఫ్ ఇంజనీరు కడా ద్వారా ప్రభుత్వానికి పంపేలా చర్యలు తీసుకోవాలని ప్రధాని కార్యాలయం ఆదేశించింది.

పెద్ద నగరాల స్థాయిలో మధిర అభివృద్ధి

మధిర, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెద్ద నగరాలలో ఉండే మౌలిక వసతులను మధిర మునిసిపాలిటీలో కల్పించి మధిరను సుందర నగరంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అభివృద్ధి చేస్తున్నారని మాజీ కౌన్సిలర్ మల్లాది సవిత, మాజీ శివాలయం చైర్మన్ పాటిబండ్ల సత్యంబాబు అన్నారు. మంగళవారం తొమ్మిదో వార్డులో భట్టి ఫొటోతో ఉన్న గోడ గడియారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సేవ చేయడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

విద్యార్థుల ప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం
సామాజిక సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు
నవ సమాజ నిర్మాణం కోసం శిబిరాలు
నేడు నేషనల్ సర్వీస్ స్కీం డే



సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో భద్రాద్రి జిల్లా ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు, వలంటీర్ల ప్రదర్శన

చుంచుపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పొరుగు వారికి సేవలు అందించడమే లక్ష్యంగా ఎన్‌సీసీ మాదిరి గానే నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) అడుగులు వేస్తోంది. సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలనే ఆలోచన ఉన్న విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో సామాజిక సేవా కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం ఇచ్చే పథకమే నేషనల్ సర్వీస్ స్కీం (జాతీయ సేవా పథకం). ఈ ఎన్ఎస్ఎస్ 1969లో జాతిపిత మహాత్మాగాంధీ శత జయంతి సందర్భంగా ఈ పథకం భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేసే కేంద్ర ప్రభుత్వ పథకం. సామాజిక సేవ ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసమే ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యం. ఇది నేటి యువతను సామాజిక సేవలో పాల్గొనడానికి ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో బుధవారం నేషనల్ సర్వీస్ స్కీం దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కథనం.

విద్యార్థుల ప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం

విద్యార్థుల ప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ బావి భారతాన్ని నిర్ణయించ వలసినదీ యువతే. దేశ పురోభివృద్ధిలోనూ, ఉద్యమాల్లోనూ విద్యార్థులు పాలు పంచుకుంటున్నారు. ఈ పథకాన్ని ప్రారంభించి నేటికి 50ఏళ్ళు పూర్తవుతున్న నేపథ్యంలో వలంటరీగా చేసే విద్యార్థులకు శిబిరాలను నిర్వహిస్తూ వారికి సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యాభ్యాసానికి ఆటంకం లేకుండా సంఘ సేవచేసే అవకాశాలను సద్వినియోగం చేసుకొని సమాజ సేవలో తమకంటూ ఎన్ఎస్ఎస్ వలంటరీగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. తోటి మనిషికి సహాయ సహకారాలు అందిస్తూ మానవత్వాన్ని ప్రదర్శించేలా పని చేస్తూ పది మందికి సహాయ సహకారాలను అందిస్తూ ముందుకు వెళ్తున్నారు.

నవ సమాజ నిర్మాణం కోసం శిబిరాలు :
భద్రాద్రి జిల్లా ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్లు

అకస్మాత్తుగా వరదలు వచ్చినప్పుడు, అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయాల్లో తక్షణ సహాయం చేసేందుకు సిద్ధంగా ఉండేదే ఎన్ఎస్ఎస్ విభాగం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎన్ఎస్ఎస్ విభాగాన్ని కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసి విద్యార్థులను ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా తీర్చిదిద్దుతున్నారు. అందులో భాగంగా జి.సునీత (యూనిట్-1), కె.ఆశాలత (యూనిట్-2), ఆర్.కృష్ణవేణి (యూనిట్-3) కో-ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో చుంచుపల్లి మండలంలోని పెనుబల్లి గ్రామ పంచాయతీలో 50 మంది వలంటీర్లతో గత మూడు రోజుల నుంచి ఈ నెల 26వ తేదీ వరకు శీతాకాల శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను విద్యా, వైద్యం, ప్రభుత్వ పథకాలఅమలుపై అధ్యాయన కార్యక్రమాలు చేపట్టి సామాజికసేవ వైపు అడుగులు వేస్తున్నారు. విరాళాలు సేకరించి పేదవారికి, అనాథలకు తోడ్పాటందిస్తూ తమ సేవ కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నారు. ప్రజలకు సమస్యల పట్ల అవగాహన, నవసమాజ నిర్మాణంలో వాలంటీర్లు చేపడుతున్న కార్యక్రమాలు తెలుపుతూ ఎన్ఎస్ఎస్ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తున్నారు.

సామాజిక సేవలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

విద్యార్థులు వలంటీర్లుగా కొన్ని లక్షణాలు ప్రదర్శిస్తేనే వారి సామర్థ్యాలను దేశాభివృద్ధికి ఉపయోగంగా నిలుస్తాయి. వాటిలో ముఖ్యంగా క్యాంపస్ అండ్ కమ్యూనిటీ, కాలేజ్ అండ్ విలేజ్, నాలెడ్జ్ అండ్ యాక్షన్ లక్ష్యంగా పెట్టుకొని ఎన్ఎస్ఎస్ అడుగులు వేస్తోంది. అదేవిధంగా వ్యక్తిగత, కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని సమీకరించడంలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. నాయకత్వం లక్షణాలను, ప్రజాస్వామిక విలువలను పాటిస్తూ, అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం, జాతీయ సమైక్యత, సామాజిక సామరస్యాన్ని అభ్యసించడం కీలకం.


పెనుబల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

విచారణ జరిపి చర్యలు తీసుకుంటా : ఏఎస్పీ

దుమ్ముగూడెం సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం సబ్ పోస్టాఫీసు పరిధిలో 'మూడు పోస్టుల్లో ఒకే ఉద్యోగి'అని ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి భద్రాచలం పోస్టల్ ఏఎస్పీ సూర్యప్రకాశ్ స్పందించారు. అంజుబాక బ్రాంచ్ ఆఫీసులో బీపీఎం, ఏబీపీఎం, దుమ్ముగూడెం ఎస్ఓ ఎంటీఎస్ పోస్టులో ప్రత్యామ్నాయ విధులు ఒక్కరే చేస్తున్నట్లు తన విచారణలో తేలితే చర్యలు తీసుకుంటానని ఫోన్ చేసి వివరించారు. విధులు అక్రమమని తేలితే వేతనం నిలిపివేస్తామని చెప్పారు. ప్రజాధనం దుర్వినియోగం జరగదన్నారు. అయితే ఏబీపీఎం పోస్టులో నామమాత్రంగా ఒకరిని నియమించి బీపీఎం, ఏబీపీఎం విధులు ఒక్కరే నిర్వర్తించడం, ఆ రెంటితో పాటు ఎంటీఎస్ ఉద్యోగాన్ని ఒక్కరే ఏకకాలంలో ఎలా నిర్వర్తిస్తారనే విషయమై వివరణ కోరగా, అన్ని విషయాలు విచారణలో తెలుస్తాయని అన్నారు.

బాణసంచా దుకాణాల అనుమతికి దరఖాస్తు చేసుకోవాలి : సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలో బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు వ్యాపారులు నేటి నుంచి 1వ తేదీ సాయంత్రంలోపు ఆయా డివిజన్ పరిధిలోని ఏసీపీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసి అనుమతి పొందాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పర్వదినం సందర్భంగా ఏర్పాటుచేసే బాణసంచా దుకాణాల్లో వ్యాపారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, పోలీసు శాఖ, నగరపాలక శాఖ, అగ్నిమాపక శాఖలు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే అనుమతితో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుతో పాటు ఏఈ-5 ఫామ్, సెల్ఫ్ అఫిడవిట్ చలాన రిసిప్ట్, ఆధార్‌కార్డుతో పాటు ఫోటో జతరపరిచి సంబంధిత ఏసీపీ కార్యాలయంలో అందించాలని తెలిపారు. అనుమతి లేకుండా బాణసంచా నిలవచేసినా, తయారు చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిని పరిశీలించిన పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ బృందం


అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న డాక్టర్ హరికృష్ణ

పాల్వంచటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిని ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ బృందం (ఐపీహెచ్ఎస్) మంగళవారం సందర్శించింది. ఆస్పత్రిలోని సౌకర్యాలు, రోగులకు అందుతున్న సేవలు, కావలసిన అవసరాలపై ఐదుగురితో కూడిన బృందం ప్రతి వార్డును కలియతిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రిలో అధనంగా కావలసిన సౌకర్యాలను గుర్తించారు. ప్రస్తుతం అందుతున్న సేవల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. గుర్తించిన అదనపు సౌకర్యాల్లో అంబులెన్స్, అప్‌గ్రేడ్ రోగనిర్ధారణ కేంద్రాలు, శానిటేషన్‌కు కావలసిన సామగ్రి, అదనపు వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పెంపు వంటి అవసరాలను గుర్తించి, వాటిపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలనా బృందం హెడ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరికృష్ణ, రీసెర్చ్ అసోసియేట్స్ డాక్టర్ శివం, డాక్టర్ రవి, ఆశిష్, శృతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్, ఆర్ఎంవో డాక్టర్ సోమరాజుదొర, నర్సింగ్ సూపరింటెండెంట్ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

బూర్గంపాడు, దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్లను సందర్శించిన ఎస్పీ


పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

బూర్గంపాడు/దుమ్ముగూడెం, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): కోడిపందాలు, పేకాట, బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. మంగళవారం బూర్గంపాడు, దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్‌లను ఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠా కదలికలపై నిఘా ఉంచి దొంగతనాల కట్టడికి కృషి చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో అధికంగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రమాద నివారణ చర్యలను చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో 'నేను సైతం' కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. గంజాయి వంటి మత్తుపదార్థాలను అక్రమంగా రవాణా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు, దుమ్ముగూడెం ఎస్ఐలు ప్రసాద్, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీలో ముమ్మరంగా వాహన తనిఖీలు

అనుమానితులుగా కనిపిస్తే సమాచారం అందించాలి: ఎస్ఐ పీవీఎన్ రావు


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసు సిబ్బంది

కరకగూడెం/పినపాక/పాల్వంచ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మండలంలోని సరిహద్దు ప్రాంతాల్లో ముమ్మరంగా పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మండలంలోని భద్రాద్రికొత్తగూడెం, ములుగు జిల్లా సరిహద్దు రంగాపురం, గుండాల, ఆళ్ళపల్లి మండలాల సరిహద్దులైన వీరాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఎస్పీ రోహిత్‌రాజు, మణుగూరు డివిజన్ డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఏడూళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు మంగళవారం కరకగూడెం ఎస్ఐ పీవీఎన్.రావు ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా వాహనదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానితులుగా కనిపించిన వారి ఆధార్, పూర్తి వివరాలు తీసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలో కొత్త వ్యక్తులు అనుమానితులుగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుమతామన్నారు. కార్యక్రమంలో సివిల్ కానిస్టేబుల్ కనికేస్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో ఏజెన్సీలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఏడూళ్లబయ్యారం సర్కిల్ పరిధిలోని ఏడూళ్లబయ్యారం, కరకగూడెం పోలీసులు ఏటూరునాగారం మణుగూరు ప్రధాన రహదారులపై విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టి, రాకపోకలు సాగించే వారి వాహనాలను, లగేజీలను పరిశీలించారు.

పాల్వంచలో ..

మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా పాల్వంచ రూరల్ పోలీసులు మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. మండల పరిధిలోని మొండికట్ట గ్రామశివారులో ప్రత్యేక బలగాలతో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పాల్వంచ సీఐ సతీష్, రూరల్ ఎస్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు సీజ్

దమ్మపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను నాగుపల్లి గ్రామ సమీపంలో మంగళవారం దమ్మపేట పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని కొవ్వూరు నుంచి ఇసుకను తరలిస్తూ దమ్మపేట మండలానికి వచ్చిన ఏపీ 26 టీఎఫ్ 6237, టీఎస్ 04 యుఈ 2788 లారీలను పోలీసులు తనిఖీ చేయగా ఎలాంటి కాగితాలు లేక పోవటంతో అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించి సీజ్ చేశారు. అనంతరం ఆ లారీలను దమ్మపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్లు కర్ల భాస్కరరావు, ఆముదాల పుల్లారావు, మద్దాల శ్రీనులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి తెలిపారు. ఇసుక ఖరీదు సుమారు రూ.40వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

24 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చాకచక్యంగా నిందితులతో సహా పట్టుకొని రిమాండ్ చేశారు. ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కార రజన, త్రినాథ్‌లు అంతర్‌జిల్లా గంజాయి ముఠాగా ఏర్పడి ఒడిశా రాష్ట్రం నుంచి అనేక రాష్ట్రాలకు అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. అయితే మంగళవారం ఒడిశా నుంచి హైదరాబాద్‌కు బస్సులో రవాణా చేస్తూ ఖమ్మంలో అనుమానస్పదంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు కనిపించారు. దీంతో వీరిని ఖమ్మం బస్టాండ్ సమీపంలో అదుపులోకి తీసుకోగా 3 మూటల్లో 23.6 కేజీల ఎండు గంజాయి కనిపించింది. వెంటనే నిందితుల్ని అదుపులోకి తీసుకొని, వారివద్ద ఉన్న ఎండు గంజాయిని సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ శ్రీహరిరావు, హెడ్ కానిస్టేబుల్స్ కరీం, కానిస్టేబుల్స్ సుధీర్, విజయ్, హనుమంతరావు, వీరబాబు, స్వరూప, బేబీ, ఉపేందర్ పాల్గొన్నారు.

'భగీరథ' ఆపరేటర్ బలవన్మరణం


గాంధీ (ఫైల్)

కూసుమంచి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన మిషన్ భగీరథ ప్రాజెక్టులో ఆపరేటర్‌గా పనిచేస్తు న్న సాధనబోయిన గాంధీ(30) మంగళవారం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కొన్ని నెలలుగా సంబంధిత సంస్థ వేతనాలు ఇవ్వకపోవడంతో పాటు, ఇటీవల అనారోగ్యానికి గురవడంతో పాటు, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు, తోటి కార్మికులు మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు.


గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


నాగరాజు (ఫైల్)

చంద్రుగొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): చంద్రుగొండ మండలం అన్నారం తండా వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మొగిలిపువ్వు నాగరాజు(37) ఖమ్మంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై చంద్రుగొండ ఏఎస్ఐ పాపయ్య తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మొగిలిపువ్వు నాగరాజు, తాటకూరి ఎల్లయ్యలు కొత్తగూడెం నుంచి స్వగ్రామం గానుగపాడుకు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్నారు. అన్నారం తండా సమీపంలో మూలమలుపు వద్ద ఎదుగా వస్తున్న ట్రాక్టర్ నాగరాజు, ఎల్లయ్య ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై నుంచి కిందపడ్డ ఇద్దరికీ తీవ్రగాయాలైయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ నాగరాజు మంగళవారం మృతి చెందాడు.

ఆకేరులో పడి రైతు..

రైతు మృతదేహం లభ్యం


రాములు (ఫైల్)

తిరుమలాయపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడ మటితండాకు చెందిన గుగులోత్ రాములు(60) ఆకేరులో ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. పడమటి తండాకు చెందిన రాములు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం ధర్మారంతండాకు చెందిన కొంత భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. సోమవారం పొలం పని ముగించుకుని ఇంటికి వస్తుండగా ఆకేరు డ్యాంపై నడుస్తూ ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడు. దీంతో అతని ఆచూకీ కోసం వెతికినా లభ్యం కాలేదు. దీంతో మంగళవారం తిరుమలాయపాలెం ఎస్ఐ జగదీష్ ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందితో గాలింపు చేపట్టారు. ఫైర్‌టీం సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి సుమారు 5గంటల పాటు గాలించారు. రాములు పడిన డ్యాంనుంచి 500 మీటర్ల దూరంలో మృతదేహం గుర్తించి వెలికితీశారు. ఘటనాస్థలానికి చేరు కున్న పోలీసులు వివరాలు సేకరించి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. రాములు మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పురుగుల మందు తాగి చికిత్సపొందుతూ రైతు..

కారేపల్లి మండలంలో ఘటన


పంతులు(ఫైల్)

కారేపల్లి సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేకపు రుగులమందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ సంఘటన కారేపల్లి మండ లంలో జరిగింది. కారేపల్లి మండలం మంగలి తండాకు చెందిన ధారావత్ పంతులు(52) తనకున్న తనకున్న నాలుగు ఎకరాల భూమిలో పత్తి, వరి సాగు చేశాడు. పంటలు ఆశాజనకంగా లేకపోవడంతో పాటు ఆర్థిక పరిస్థితి ఇబ్బంది కరంగా ఉండటంతో మనోవేదనకు గురైన పంతులు ఆదివారం సాయంత్రం ఇంట్లో పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడనుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య హంసాలి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్యా, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సాగర్‌కాలవలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొణిజర్ల, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తనికెళ్ల సమీపంలో గల బోనకల్ బ్రాంచ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మంగళవారం జరిగింది. ఎస్ఐ సూరజ్ కథనం ప్రకారం బోనకల్ బ్రాంచ్ కెనాల్‌లో మృతదేహం ఉన్నట్టు గ్రామపంచాయతీ అధికారి తెలిపిన సమాచారంతో వెళ్లి పరిశీలించగా నీళ్లలో మృతదేహం తేలియాడుతూ కనిపించిందని తెలిపారు. మృతుడికి 30నుంచి 35ఏళ్లున్న మగ వ్యక్తిగా గుర్తించామన్నారు. మృతుడు నల్లని వస్త్రాలు ధరించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం మార్చురీకి తరలించామని తెలిపారు.

సుత్తితో కొట్టి.. రిటైర్డ్ సింగరేణి కార్మికుడి హత్య

వివాహేతర సంబంధం నేపథ్యంలో ఘటన?
మృతుడికి, నిందితుడికీ గతంలోనే పరిచయం!
పోలీసుల అదుపులో నిందితుడు, సహకరించిన వ్యక్తి?



విచారణ నిర్వహిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఘటనా స్థలంలో రామ్మోహన్‌రావు మృతదేహం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని గణేష్‌బస్తీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గుబ్బల రామ్మోహన్‌రావు(62) సోమవారం రాత్రి హత్యకు గురైన సంఘటన తీవ్ర సంచలనం రేపింది. రామ్మోహన్‌రావు సోమవారం రాత్రి తన భార్యతో కలిసి ఇంట్లో కూర్చుని అల్పాహారం తీసుకుంటున్న సమయంలో హఠాత్తుగా మాస్క్ ధరించిన ఓ వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి సుత్తితో దాడిచేసి హత్య చేసి పరారయ్యాడు. స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. నిందితుడు వారిపై కూడా దాడిచేసేందుకు యత్నించాడు. కొత్తగూడెం పట్టణం గణేష్ బస్తీలో సోమవారం రాత్రి పది గంటల సమయంలో జరిగిన ఈ ఘటన కలకలం రేపగా.. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. మాస్క్‌ధరించిన వ్యక్తి తనపై సుత్తితో దాడి చేయడంతో భయాందోళకు గురైన రామ్మోహన్‌రావు ఇంటి వెనుకకు పరిగెత్తి కేకలు వేశాడు. అప్పటికీ నిందితుడు అతడి వెంటపడి సుత్తితో పాటు అక్కడున్న ఇటుకలతో విచక్షణ రహితంగా దాడి చేయడంతో రామ్మోహన్‌రావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ తర్వాత నిందితుడు పరారవుతుండగా.. స్థానికులు అతడిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దాంతో నిందితుడు తన చేతిలో ఉన్న సుత్తితో వారిపైనా దాడికి ప్రయత్నించడం, బెదిరించడంతో భయంతో వారు వెనుకడుగు వేశాడు. రామ్మోహన్‌రావును హతమార్చిన నిందితుడు పట్టణంలోని రామవరానికి చెందిన 26ఏళ్ల యువకుడిగా గుర్తించారు. అనధికారిక సమాచారం మేరకు మృతుడు రామ్మోహన్‌రావు, నిందితుడికి గతంలోనే పరిచయం ఉందని, వారిద్దరూ ఒకే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారని, ఆ నేపథ్యంలో ఈ హత్య జరిగిందన్న కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. కాగా రామ్మోహన్‌రావు సింగరేణి సంస్థలో పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందాడు. ఆయనకు భార్య, నలుగురు సంతానం ఉన్నారు. గతంలో గౌతమ్‌పూర్ గ్రామపంచాయతీలో నివసించే రామ్‌మోహన్‌రావు ఉద్యోగ విరమణ అనంతరం కొత్తగూడెం పట్టణంలో గణేష్ బస్తీ ప్రాంతంలోకి మారాడు. ప్రాంతం మారినప్పటికీ గతంలో పరిచయమైన ఒక మహిళతో రామ్మోహన్‌రావు తన వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే సదరు మహిళతో నిందితుడు సైతం వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్టు సమాచారం. ఈ దాడికి ముందు నిందితుడిని మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై రామ్మోహన్‌రావు ఇంటి వద్ద వదిలి వెళ్లినట్టు సమాచారం. దాడికి ఉపయోగించిన సుత్తిని ఆ ప్రాంతంలోని ఓ డ్రెయినేజీలో పడవేసి నిందితుడు పరారయ్యాడు. దాంతో పాటుగా నిందితుడికి, మృతుడికి గతంలో పరిచయం ఉన్న నేపథ్యంలో మరేవైనా కారణాలున్నాయన్న కోణంలోనూ పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు. సంఘటనకు సంబంధించి ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలమేరకు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ నాలుగు బృందాలను ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. స్థానికంగా సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు స్థానికుల నుంచి సేకరించిన సమాచారం మేరకు నిందితుడిని, అతడికి సహకరించిన మరో వ్యక్తిని మంగళవారం తెల్లవారుజామున కొత్తగూడెం డివిజన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.

కుటుంబ సభ్యులకు మహారాష్ట్ర వాసి అప్పగింత


పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు నరేష్‌ను అప్పగిస్తున్న అన్నం శ్రీనివాసరావు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం కోల్పోయి రోడ్లవెంట తిరుగుతున్న ఓ వ్యక్తిని వైద్యసేవల అనంతరం మంగళవారం పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు. ఈనెల 19వ తేదీ రాత్రి 11గంటలకు గుర్తు తెలియని, మతిస్థిమితం లేని ఓ యువకుడు(38) ఖమ్మం టూటౌన్ పోలీసుల పరిధిలో వచ్చే పోయే వాహనాలకు ఎదురుగా వెళుతూ ఇబ్బందులు పెడుతూ భయబ్రాంతులకు గురి చేస్తుండగా స్థానికులు డయల్ 100కు ఫోన్‌చేశారు. వెంటనే స్పందించిన టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అన్నం ఫౌండేషన్ సిబ్బంది తెలపగా పోలీస్ సమక్షంలో ఆ వ్యక్తిని ప్రభుత్వ వైద్యశాలకి తరలించారు. వైద్య సేవల అనంతరం కోలుకొని తన కుటుంబ సభ్యుల ఆచూకీ చెప్పి మొబైల్ నెంబర్ చెప్పాడు. ఈ యువకుడి పేరు నరేష్ (38). తండ్రి ఉధవ్ దివాటివర్, గ్రామం మంజెగాన్, జిల్లా గడిచిరోల్, రాష్ట్రం మహారాష్ట్ర అని తెలపడంతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేయగా కుటుంబ సభ్యులు మహారాష్ట్ర నుంచి ఖమ్మం అన్నం ఫౌండేషన్‌కి చేరుకున్నారు. మంగళవారం ఖమ్మం టూ టౌన్ సీఐ బాలకృష్ణ సమక్షంలో కుటుంబ సభ్యులైన రామకృష్ణ లక్ష్మణ్ పాలక్‌వార్, రవీంద్ర శివరాం గడ్డిల్‌వార్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మం శివారులో దొంగల బీభత్సం

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని వైఎస్ఆర్ నగర్‌లో దొంగలు బీభత్సం సృష్టించిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఖానాపురం హవేలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వైఎస్ఆర్ నగర్‌లో గుర్తుతెలియని ఎనిమిది మంది దొంగలు ఇండ్లలో వరుస చోరీకి యత్నించారు. వరుసగా నాలుగు ఇళ్లతో పాటు ఓ డబ్బా దుకాణంలో కూడా చోరీకి యత్నించగా అనంతరం మరో రెండు ఇళ్లలో కొంత బంగారం, వెండి చోరీ చేశారు. వీరిలో వేంసూరులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తు న్న భరత్ వైఎస్ఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన ఇంటిలో దొంగలు కొంత బంగారాన్ని చోరీ చేశారు. అదేవిధంగా కానిస్టేబుల్ ఇంటి పక్కనే ఉన్న పరచబడిన ఉపేంద్ర అనే వ్యక్తి ఇంటిలో సుమారు 8 గ్రాముల బంగారం, 40 గ్రాముల వెండి చోరీకి గురైంది. మరో ఇంటిలో కొన్ని డాక్యుమెంట్లు తీసుకుని ఇంటి సమీపంలో దుండగులు పడేసివెళ్లారు. మంగళవారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు ఖానాపురంహవేలి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ గౌతమి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఓ ఇంటిలో సీసీ కెమేరాలో రికార్డు అవ్వగా మొత్తం ఎనిమిది మంది గుర్తుతెలియని వారు చోరీలకు యత్నించి నట్టు పోలీసులు గుర్తించారు. ఇద్దరు బాధితులు నుంచి ఫిర్యాదులు స్వీకరించి కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. కాగా చోరీకి యత్నించిన ఇండ్లలో ఒక ఇంటిలో గతంలో కూడా చోరీ జరగ్గా పోలీసులు రికవరీ చేసినట్టు తెలిసింది.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంరూరల్,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ఖమ్మంరూరల్ మండలం, ఆరెంపుల, ఎమ్ వెంకటాయపాలెం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించనున్నారు. ఆరెంపులలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, సీసీ రోడ్ల నిర్మాణం, ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణానికి శంకుస్థాపన, పశుసంవర్ధకశాఖ నూతన సబ్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఎమ్ వెంకటాయపాలెం గ్రామంలో గిడ్డంగులు సంస్థ కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జీ దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బతుకమ్మ పాటలు.. అమ్మవారి పూజలు

నగరంలో అట్టహాసంగా కొనసాగుతున్న వేడుకలు



బీఆర్‌ఎస్ కార్యాలయంలో బతుకమ్మ సందడి



పర్ణశాల రామాలయం వద్ద బతుకమ్మ వేడుకలు





స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధాన్యలక్ష్మీ, జమ్మిబండ వద్ద గాయత్రిదేవి అలంకరణలో..



రాజేశ్వరీ అమ్మవారి ఆలయంలో..



విన్‌ఫీల్డ్ పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో పాఠశాల డైరెక్టర్లు

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): నగరంలో స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో 21వ వార్షిక శరన్నవరాత్రుల వేడుకలు జమ్మిబండ వద్ద అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు..వేడుకల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో కొత్తూరు జగన్‌మోహన్‌రావు,భక్తబృందం అధ్యక్షుడు తూములూరి లక్ష్మీ నరసింహారావు, భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు. స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అమ్మవారు ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో ధాన్యలక్ష్మీ అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇందిరానగర్ పర్ణశాల రామాలయంలో, రోటరీనగర్ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో, ఎన్‌ఎస్‌పి రోడ్ దుర్గామాత ఆలయంలో, మామిళ్లగుడెం, గాంధీచౌక్, ప్రశాంతినగర్, కైకొండాయిగుడెం,జయనగర్‌కాలనీ, బల్లేపల్లి, తదితర ప్రాంతాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అల్లపు గారెలు, పాయిసం, పులిహోర తదితర ప్రత్యేక నైవేద్యాలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం అమ్మవారి మండపాల వద్ద బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ సంబరాల్లో భాగంగా మంగళవారం మూడోరోజు జిల్లాలో ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముద్దపప్పు బతుకమ్మను పేర్చి ఆడుతూ, పాడుతూ తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించారు. నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల, రోటరీనగర్ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో, నగరంలోని పలు ఆలయాలలో ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలలో మంగళవారం ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఖమ్మంరూరల్: ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బతకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ నవీన్ బాబు, డైరెక్టర్ వెంకటరమణ, ప్రిన్సిపల్ బి.గోపాల్‌లు విద్యార్థినులతో కలిసి బతకమ్మ వేడుకలు నిర్వహించారు.



రాజేశ్వరీ అమ్మవారి ఆలయంలో..





టీడీపీ ఆఫీస్ సమీపంలోని కూరగాయల మార్కెట్‌లో..



టీడీపీ కార్యాలయంలో..

పర్ణశాలవద్ద అమ్మవారి వేషధారణలో భక్తురాలు

పిల్లలకు సమగ్ర విద్య అందించాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- విద్యాశాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంకలెక్టరేట్,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):పాఠశాలలో పిల్లలకు సమగ్ర విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖపై సంబంధిత అధికారులతో కలెక్టర్ మంగళవారం సమీక్షించి ఎఫ్‌ఎల్‌ఎన్, ఆధార్, అపార్ అప్డేషన్, ఎఫ్‌ఆర్‌ఎస్, భవిత సెంటర్, మధ్యాహ్న భోజనం, తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించిందని, పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు అందుతున్న విద్యాప్రమాణాలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ తెలిపారు. దసరా తర్వాత ప్రతీవారం డీఈవో, సమగ్రశిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్, ఎంఈఓల ఆధ్వర్యంలో పాఠశాలలను సందర్శించి ఎఫ్‌ఎల్‌ఎన్ అమలును తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్న భోజనం పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, మండల నోడల్ అధికారులు, సీఆర్పీలు, ఎంఎస్ కో ఆర్డినేటరు తదితరులు పాల్గొన్నారు.

హామీ నిలబెట్టుకున్న మంత్రి పొంగులేటి

బచ్చోడులో విద్యుత్ తీగల సమస్యకు పరిష్కారం



తిరుమలాయపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బచ్చోడులో ఏళ్ల తరబడిగా ఉన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎన్నికల సమయంలో విద్యుత్ వైర్లతోపాటు 11కేవీ వైర్లు తొలిగిస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లను తొలగించారు. భారీవర్షాల సమయంలో ఈ వైర్లు ప్రమాదకరంగా మారడంతో ఆప్రాంత వాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనిలో భాగంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు రెండురోజులనుంచి కూసుమంచి ఏడీ కోక్యానాయక్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ప్రమాదకర విద్యుత్‌వైర్లను తొలిగించారు. అలాగే కొత్త విద్యుత్ స్థంభలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా రత్నాకర్



కండెపనేని రత్నాకర్

ఖమ్మంలీగల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఖమ్మం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది కండెపనేని రత్నాకర్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. రత్నాకర్ 1994లో న్యాయవాదిగా బార్‌కౌన్సిల్ నమోదు చేయించుకున్నారు. అదే సంవత్సరం నుంచి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యానారాయణ వద్ద కొంతకాలం జూనియర్ న్యాయవాదిగా పనిచేశారు. జిల్లా కోర్టులో 31 సంవత్సరాలుగా సీనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి కృతజ్ఞతలు తెలిపారు. రత్నాకర్ నియామకంపట్ల కాంగ్రెస్‌పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు, వివిధ న్యాయవాద సంఘాలు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కార్పొరేటర్ ప్రసన్నకృష్ణ



చెక్కులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నం ప్రసన్నకృష్ణ

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం ప్రసన్నకృష్ణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బుధవారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి, బాణాల లక్ష్మణ్, మాజీకౌన్సిలర్ సింగం అంజయ్య, తొగర భాస్కర్, కాటం కొమరయ్య, దయ్యాల నాగేశ్వరరావు, జెట్ల లక్ష్మణ్, బాల్దే నాగేశ్వరరావు, రామకృష్ణ, మేకల అశోక్, తుపాకుల మధు, ఓరుగంటి మళ్లేశం, కేసోజు వీరాచారి, సెల్వం, జ్ఞానేశ్వర్, ఎరకనబోయిన వెంకటేశ్వర్లు, చుంచు శ్రీను పాల్గొన్నారు.

ఖమ్మం నేత్రనిధి ఉచిత అంబులెన్స్ ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న నరేందర్

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనేత్రనిధి ఆధ్వర్యంలో ఆంబులెన్స్‌ను మంగళవారం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నరేందర్‌ప్రారంభించారు. దూరప్రాంతాల నుంచి ఖమ్మంప్రభుత్వ హాస్పిటల్ మార్చురీ వద్దకు పోస్టుమార్టంకోసం వచ్చే నిరుపేదల కోసం ఈ అంబులెన్స్ సేవలను వినియోగించుకోవచ్చన్నారు.చనిపోయిన వారి నేత్రాలను దానం చేస్తే పోస్టుమార్టం అనంతరం వారి పార్థీవ దేహన్ని వారి ఇంటి వరకు ఉచితంగా తరలిస్తామన్నారు.ఈకార్యక్రమంలో ఆర్‌ఎంవో రాంబాబు,జిల్లా అంధత్వ నివారణ అధికారి రామునాయక్, ఆప్తాల్మిక్‌కే.రాజేశ్వరావు ఖమ్మంనేత్రనిధి సభ్యులు రాఘవరెడ్డి, పద్మనాభం,కల్వకుంట్ల గోపాలరావు, ఉదారపు కిరణ్, పి.హరి ప్రసాద్, సీహెచ్ ప్రసాద్, సుదర్శన్,శ్రీహరి,జలీల్,నాగేశ్వరావు,గురువమూర్తి, అంబేద్కర్, ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.

మళ్లీ మొదటికి..

(5వ పేజీ తరువాయి)

లారీల ఇసుకను తరలించినట్టు చెబుతున్నారు. పెద్ద మొత్తంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకునే వారే లేకపోవటం వెనుక ఉన్న లావాదేవీలేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పట్టుకున్నది ఎవరు.. వదిలింది ఎవరు?

సోమవారం రాత్రి పెద్ద సంఖ్యలో ఇసుక లారీలు సత్తుపల్లి పట్టణానికి చేరుకున్నాయని ప్రచారం జరిగింది. వీటిలో రెండు లారీలు మాత్రమే పట్టుబడ్డాయని, వాటిని రెండు గంటల వ్యవధిలో వదిలేశారనే ప్రచారం పట్టణంలో దావానంలా వ్యాపించింది. కొన్ని లారీలు ఏ ఆటంకం లేకుండా ఆంధ్రా ఇసుక అన్‌లోడ్ చేసి వెళ్లిపోగా ఆంధ్రా రిజిస్ట్రేషన్‌తో ఉన్న మరో రెండు లారీలను ఎవరు పట్టుకున్నారు? వాటిని ఎవరు వదిలేశారు? మధ్యలో ఏమి జరిగిందనే విషయం సత్తుపల్లి పట్టణంలో చర్చనీయంశంగా మారింది. మంగళవారం ఈ రెండు లారీల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.

నాగుపల్లి, గండుగులపల్లిలోనూ దాడులు..

ఆంధ్రా నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న సత్తుపల్లికి చెందిన ఒక వ్యక్తికి చెందిన అక్రమ ఇసుక లారీలను సోమవారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి, నాగుపల్లిలో పట్టుకున్నట్టు ప్రచారం జరిగింది.ఈలారీలను సత్తుపల్లికి చెందిన ఒక శాఖ ఉద్యోగి వెళ్లి పట్టుకున్నారని, సత్తుపల్లి ఉద్యోగి వేరే జిల్లా వెళ్లి పట్టుకోవటంపై ఇసుక అక్రమ వ్యాపారులు సదరు ఉద్యోగితో వాగ్వాదానికి దిగినట్టు ప్రచారం జరగటంతో చివరికి సదరు లారీలను దమ్మపేట మండలంలోని అధికారులకు అప్పగించినట్టు చర్చ జరుగుతోంది.

నాయకులను ఆశ్రయించిన అక్రమార్కులు...

ఇసుక లారీలను సోమవారం రాత్రి పట్టుకున్న విషయంపై అక్రమార్కులు అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఒకరిని ఆశ్రయించినట్లు తెలిసింది. ఆయన జరుగుతున్న పరిణామాలపై తీవ్రఅసంతృప్తి వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. ఇసుక అక్రమరవాణాకు సంబంధించి కఠినంగా వ్యవహరించాలనుకుంటే అందరి పట్ల ఒకే రకంగా వ్యవహరించాలని కొన్ని వాహనాలు పట్టుకోవటం, వదిలేయటం, మరి కొన్ని స్వాధీనం చేసుకోవటమేమిటని వ్యాఖ్యానించినట్టు చెబుతున్నారు. మొత్తంగా ఈ వ్యవహారంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లనున్నట్టు సదరు నాయకుడి అనుచరులు చెపుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

వైరా,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):త్వరలోజరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. మంగళవారం వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో దొంతెబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం డివిజన్ కమిటీ సమావేశంలో నున్నా మాట్లాడారు. ప్రజల పక్షాన సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడంతో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. వర్షాకాలంలో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

'టెన్ టైమ్స్' లఘు చిత్రానికి నాలుగు అవార్డులు



ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో తెలుగు షార్ట్ ఫిలిం అసోసియేషన్ వారు నిర్వహించిన 2025 జాతీయస్థాయి తెలుగు షార్ట్ ఫిలిం పోటీల్లో జిల్లా వాసి రామడుగు వసంత్ దర్శకత్వం వహించిన టెన్ టైమ్స్ లఘు చిత్రానికి నాలుగు అవార్డులు లభించాయి. ఉత్తమఎడిటర్, ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమనటి, టాప్ 15 చిత్రాల కేటగిరీలో ఒకటి చొప్పున ఈ అవార్డులు లభించాయి. ప్రముఖ సినిమా దర్శకుడు వి.ఎన్. ఆదిత్య న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ప్రముఖ సినీ దర్శకులు శ్రీ వీరశంకర్, శ్రీరామ్ భీమన విజేతలకు బహుమతులను అందజేశారు.

3 నుంచి రేషన్ దుకాణాల బంద్

రేషన్‌డీలర్ల సంఘం నాయకులు

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం రేషన్‌డీలర్లకు కమిషన్ డబ్బులు సెప్టెంబరు30తేదీ వరకు విడుదల చేయకపోతే అక్టోబరు మూడు నుంచి దుకాణాలు బంద్ చేయనున్నట్లు రేషన్‌డీలర్ల సంఘం నాయకులు బానోతు వెంకన్న, షేక్ జానిమియా తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయి కోటి రాజు అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ కమిషన్ ఆరు నెలల డబ్బులతో పాటు సెప్టెంబరు నెల రాష్ట్ర ప్రభుత్వ కమిషన్ డబ్బులు ఈనెల 30వరకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే అక్టోబరు ఒకటి, రెండో తేదీల్లో హైదరాబాద్ కమీషనర్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు.ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు ఆధ్వర్యంలో సివిల్ సప్లై రాష్ట్రఅధికారులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి రూరల్‌మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, గుత్తుల శ్రీనివాసరావు, పెనుబల్లి మండల డీలర్ రవికుమార్ పాల్గొన్నారు.



జిల్లా ఆస్పత్రి సదరం విభాగంలో విచారణ

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రి సదరం విభాగంలో పనిచేస్తున్న ఓ డేటాఎంట్రీ ఆపరేటర్‌పై వచ్చిన ఆరోపణలపై మంగళవారం మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత విచారణ నిర్వహించారు. సదరం విభాగంలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ అక్కడ పని చేస్తూ అర్హత లేకున్నా వికలాంగ సర్టిఫికెట్‌ను పొందాడంటూ జిల్లావికలాంగుల సంఘం అధ్యక్షుడు నాగరాజు ఇటీవల కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ వేల్పుల విజేతను విచారణ అధికారిగా నియమించారు. ఆమె ఆస్పత్రిలో సదరం విభాగంలో ఏడుగురిని విచారన జరిపారు. ఈ నివేదికలను కలెక్టర్‌కు బుధవారం అందచేయనున్నట్లు సమాచారం.

27న వైరాలో రక్తదాన శిబిరం



వైరా, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న నియోజకవర్గంలోని యువత సహకారంతో ఆశ్రయ సేవ సొసైటీ ఆధ్వర్యంలో వైరా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆవిష్కరించారు. తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటుచేస్తున్న నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సేవ సొసైటీ నిర్వాహకులు నారపోగు ఉదయ్, ఇరుగు నవీన్, యంగల వెంకటేష్, కాంపల్లి శ్రీను, నంబూరి అక్షయ్ పాల్గొన్నారు.

చర్మ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ముదిగొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చర్మవ్యాధుల పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చర్మవ్యాధుల నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ తులసీ జారే సూచించారు. మంగళవారం ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా శక్తివంతమైన కుటుంబ కార్యక్రమంలో ప్రత్యేక చర్మ వ్యాధుల వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ తులసీ పలువురు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. డాక్టర్లు అంకం అరుణాదేవి, నస్రీన్ జాహాన్, వైద్య సిబ్బంది మధుసూదన్‌రావు, రామారావు, లత, పద్మావతి పాల్గొన్నారు.



కలకోట ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలి

బోనకల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలకోట ఎస్సీ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్దించాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు. మండలంలోని కలకోట రాళ్ల వాగు వద్ద గతంలో ఏర్పాటు చేసిన లిఫ్టును ఆ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లిఫ్ట్ ద్వారా 600 ఎకరాల భూమికి నీళ్లు అందుతున్నాయని, గత ప్రభుత్వ హయంలో పైపులైన్ పనులను కాంట్రాక్టర్ నాసిరకంగా చేయడం వల్ల అవి పగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు మాతంగి శ్రీనివాసరావు, బలుగూరి అచ్చయ్య, మాతంగి జనార్ధన్, బల్గోరి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించిన మిషన్ భగీరథ కార్మికులు

వైరా, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికులు సమ్మె విరమించారు. ఎల్అండ్‌టీ కంపెనీ మేనేజర్లు టీఎల్‌కే.రెడ్డి, హరిప్రసాద్, పాషా, వైరా ఎస్‌ఐ పి.రామారావు సమక్షంలో మిషన్ భగీరథ జేఏసీ నాయకులతో మంగళవారం జరిపిన చర్చలు ఫలించాయి. దాంతో సమ్మె విరమిస్తున్నామని జేఏసీ నాయకులు మద్దెల రవి, యాకూబ్‌అలీ, అనంతరాములు, బాలకృష్ణ, పాపగంటి రాంబాబు, వెంకయ్య తెలిపారు. ఈనెల 26వతేదీన ఒకనెల జీతం, వచ్చేనెల పదోతేదీ లోగా మరోనెల జీతం, దీపావళి పండుగ నాటికి రెండునెలల జీతాలు ఇస్తామని ఎల్అండ్‌టీ మేనేజర్లు జేఏసీ నాయకులకు, కార్మికసంఘాల సభ్యుల సమక్షంలో హామీ ఇచ్చినందున సమ్మె విరమించామని తెలిపారు.

మరో వారంలో.. శాండ్ బజార్

- ఇందిరమ్మ లబ్ధిదారులకు పంపిణీ
- టన్ను రూ.1100చొప్పున విక్రయం
- అవసరాన్ని బట్టి పెంచే అవకాశం



మార్కెట్ యార్డులో లారీ నుంచి డంప్ చేస్తున్న ఇసుక

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆర్థిక భారం తగ్గిస్తూ తక్కువ ధరకు నాణ్యమైన ఇసుకను అందించేందుకు మరో వారంలో సత్తుపల్లిలో శాండ్ బజార్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయానుంది. ఇందిరమ్మ ఇళ్లవంటి ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు, నిర్మాణ రంగంలో ఇసుక కొరతను, అధిక ధరలను తగ్గించే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ) ఆధ్వర్యంలో స్థానిక వెంగళరావునగర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు, సివిల్ సప్లయ్ గోడౌన్, ఐడీసీ కార్యాలయాల ఆవరణలో మణుగూరు పరిసర ప్రాంతాల్లోని గోదావరి నుంచి లారీలలో టన్నుల కొద్దీ ఇసుకను డంప్ చేస్తున్నారు. ఈ ఇసుక బజార్‌ను త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయిచే ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేపడుతున్నట్లు హౌసింగ్ ఏఈ పవన్ తెలిపారు.

టన్ను ఇసుక రూ.1100

స్టాక్‌యార్డుల నుంచి మెట్రిక్ టన్నుకు సన్న ఇసుక రూ.1100చొప్పున వసూలు చేయనుండగా రవాణా చార్జీలు అదనమని తెలుస్తోంది. వినియోగదారులు 1 టన్ను నుంచి 10టన్నుల వరకు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించి ఎప్పుడైన ఇసుక సేకరణకు బుకింగ్ చేసుకునే అవకాశం ఉండగా ట్రాక్టర్ 3-5టన్నులు, 6టైర్ లారీ 6-10టన్నులు ఇసుక సేకరణకు వాహనాలను వినియోగించే అవకాశం ఉంది. చోరీ జరగకుండా నిఘా నేత్రాలను ఏర్పాటు చేస్తుండగా మైనింగ్ శాఖ నియంత్రణలో ఉండే ఈ శాండ్ బజార్‌పై ఇతరత్రా సందేహాల కోసం టీజీఎండీసీ హెల్ప్‌లైన్ నెంబర్ 155242ను సంప్రదించవచ్చు.

జోరుగా ఇళ్ల నిర్మాణాలు..

సత్తుపల్లి పట్టణంతోపాటు మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. మునిసిపాలిటీలో 396, మండలంలో 558 నిర్మాణంలో ఉండగా ఇసుక కొరత లబ్ధిదారులకు తీరనుంది. వివిధ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే లబ్ధిదారులకు సరిపడా ఇసుక అందే అవకాశం ఉంది. ఇందిరమ్మ ఇంటికి టన్ను రూ.1100, ఇతర నిర్మాణాలకు రూ.1300కేటాయించామని, డిమాండ్‌ను బట్టి ఇసుకను లబ్ధిదారులకు సప్లయ్‌చేసే అవకాశం ఉందని నియోజకవర్గ శాండ్‌బజార్ ఇంచార్జీ రాహుల్ తెలిపారు.

స్థల వివాదంతో నిలిచిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

- లబోదిబో మంటున్న బాధితురాలు



బోనకల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా, పూజారి కరుణించని చందానా ఉంది బోనకల్ మండలం రాపల్లి గ్రామంలో ఓ ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారురాలి పరిస్థితి. మూడు నెలలుగా కాళ్ల అరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారని తన గోడును మంగళవారం విలేకర్లకు విన్నవించుకుంది. గ్రామానికి చెందిన రాచకొండ రాధకు మొదటి విడతలో ప్రభుత్వ ఉత్తర్వులు నెం.1764/కెహెచ్ఎం/ఇందిరమ్మ ఇళ్లు/2025/4 ద్వారా ఈ ఏడాది జూన్ 25వ తేదిన ఇళ్లు మంజూరైంది. ఇందుకు సంబంధించి మంజూరు పత్రం కూడ లబ్ధిదారురాలికి ఇచ్చారు. 45 రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని, రూ.5 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. ఎంతగానో సంతోషించి ఇంటి నిర్మాణానికి ముగ్గులు పోయించారు. ఈ క్రమంలో ఇంటి నిర్మాణం చేస్తున్న స్థలం రాచకొండ రాధది కాదని, గతంలో కుల వృత్తులకు కేటాయించిన ప్రభుత్వం స్థలమని కొందరూ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కాంగ్రెస్ నాయకుల మధ్య జరుగుతున్న ఆదిపత్య పోరు స్థల వివాదంలో రెండు వర్గాలుగా విడిపోవడానికి దారితీసింది. అధికారులు ఎవ్వరి వాదనలు వారు ప్రజా ప్రతినిధులను కలిసి చెబుతుండడంతో వారు కూడా ఏం చేయ్యలేక మౌనంగా ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజకీయ జోక్యం లేకుండా వాస్తవ పరిస్థితులను విచారించి తన సమస్యను పరిష్కరించాలని రాధ కోరుతోంది. 1973లో అప్పటి ప్రభుత్వం తమ పూర్వీకులకు ఇళ్ల స్థలాలను ఇవ్వగా, దాంట్లో తాము ఇళ్లు కట్టుకొని, ఇంటి పన్ను చెల్లిస్తూ ఉంటున్నామని, కొత్తగా ఇళ్లు మంజూరు కావడంతో శిథిలావస్థలో ఉన్న ఇంటిని కూడా తొలగించినట్లు ఆమె తెలిపింది. నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం జరిపే స్థలం పత్రాలు పరిశీలించిన మీదటే ఇళ్లు మంజూరు చేస్తారు. అన్ని క్లియరెన్స్ ఉండబట్టే తనకు ఇళ్లు ఇచ్చారని, ఇంటి నిర్మాణ సమయంలో మాత్రం కొందరు కావాలని ఫిర్యాదు చేయగా అధికారులు నిలిపివేశారని వాపోయింది. ఆ స్థలానికి ఎవరు పట్టదారులో వారు ఎక్కడ ఉంటారో? చెప్పాలని, వారిని పిలిపించాలని తాను అధికారులను కోరినా, ఫిర్యాదులు చేస్తున్నందున తామేమి చేయలేమని చెప్పడం తనకు ఎంతగానో బాధను కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు మంజూరైన ఇంటి నిర్మాణ పనులు కొనసాగించుకునేలా చూడాలని ఆమె ప్రాదేయపడింది. ఇట్టి విషయమై తహసీల్దార్ ఎం. రమాదేవిని వివరణ కోరగా గతంలో కుల వృత్తుల వారి కోసం ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, 5 సెంట్ల భూమిలో రాధ ఇళ్లు నిర్మించుకునేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని, మరో 5 సెంట్ల స్థలం కూడ తమదేనని వారు చెబుతుండడం సమస్యగా మారింది. ముందుగా ఇళ్లు నిర్మించుకోవాలని, ఆ తర్వతాస్థలం ఆధారాలతో సహ వస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

మున్నేరు వరదతో లంక భూముల సర్వేకు అంతరాయం

చింతకాని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం చిన్నమండవ గ్రామ సమీపంలోని మున్నేటి లంకలో వివాదాస్పంగా మారిన ముదిగొండ మండలం గంగాపురం రెవెన్యూ భూముల సర్వేకు మంగళవారం మైనింగ్, ముదిగొండ, చింతకాని రెవెన్యూ అధికారులు చేరుకున్నారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి మున్నేరు వరద ఒక్కసారిగా పెరగడంతో సర్వేకు ప్రారంభించకుండానే వెనుదిరిగారు. మైనింగ్ ఆర్ఐ నాగరాజు, చింతకాని ఆర్ఐ ఏకవీర, సర్వేయర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

మధిర,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ మంగళవారం మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జైదాసు మాట్లాడుతూ.. టూ వీలర్స్ నడిపే వారందరు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ పిఓ తౌరియ,వాలంటీర్లు లత, కమల, సాంబయ్య, షహానా బేగం, నాగరాజు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇల్లు

చింతకాని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామానికి చెందిన చాట్ల మరియదాసుకు చెందిన ఇల్లు అకాల వర్షాలకు సోమవారం రాత్రి కూలిపోయింది. కూలిపోయిన ఇంటిని పంచాయతీ కార్యదర్శి కవిత పరిశీలించారు. గ్రామస్థుల వినతి మేరకు బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు చాట్ల రాజశేఖర్, పంది మురళి, మార్కపూడి వెంకట్, చాట్ల బాబు, పెద్దరాధయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను దగాచేసిన సింగరేణి సంస్థ



జేవీఆర్ ఓసీపీలో మాట్లాడుతున్న శరత్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికులను విస్మరిస్తూ సంస్థ దగా చేసిందని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ అధ్యక్షుడు అమర్లపూడి శరత్ అన్నారు. మంగళవారం స్థానిక జేవీఆర్ ఓసీపీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతూ.. సంస్థలో సుమారు 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తుండగా తూతూమంత్రంగా వాటాను పెంచిందని, అధికారంలోకి వచ్చి 18నెలలు గడిచినప్పటికీ నేటికీ వేతనాలు పెంచకపోవడం, వీరి శ్రమతో వచ్చిన లాభాల నుంచి ఆశించిన స్థాయిలో వాటా ఇవ్వకపోవడం వంచనకు గురిచేయడమేనన్నారు. ఇటీవల ప్రజాభవన్ ధర్నాలో సైతం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కూడా పెంచుతామని హామీ ఇచ్చి నిరాశ పరిచారన్నారు. ఎంగిలిమెతుకుల వలే రూ.5,500బోనస్ ఇవ్వడం సంస్థతోపాటు ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని, ఈ క్రమంలోనే భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవి, నాగార్జున, నరసింహారావు, పెద్దిరాజు, కళావతి, భారతమ్మ, కృష్ణవేణి, శిరీష, శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు

'పామాయిల్'పై సలహాలు, సూచనలు ఇవ్వాలి



మాట్లాడుతున్న బొంతు, మహేశ్వర్‌రెడ్డి, పుల్లయ్య

కొణిజర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ తోటలు పెంపకంపై చేస్తున్న హడావుడితోపాటు రైతులకు మొక్కలు నాటిని దగ్గర నుంచి సలహాలు, సూచనలు బాధ్యతగా అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, పామాయిల్ రైతు సంఘం నాయకులు తంబూరు మహేశ్వర్‌రెడ్డి, కొంకెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని లాలాపురం గ్రామంలో మంగళవారం చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన కొణిజర్ల, వైరా మండలాల పామాయిల్ రైతుల సదస్సులో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచే ఉద్దేశంతో హడావుడిగా వేలాది ఎకరాల విస్తీర్ణంలో మొక్కలు నాటించడం జరిగిందని కానీ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు సకాలంలో అదించడం లేదని వారు ఆరోపించారు. మొక్కల నాణ్యత లేక నష్టపోయినప్పుడు ఆయిల్‌ఫెడ్, ప్రభుత్వం రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు చిలకాని వెంకటరావు,దొడ్డ చక్రధర్‌రావు కొప్పుల కృష్ణయ్య, సంక్రాంతి నరసయ్య, దొడ్డపునేని కృష్ణార్జునరావు, తాటిపల్లి వీరభద్రం, కట్ట రాంబాబు, అజయ్, సంక్రాంతి పురుషోత్తం, పాషా, బ్రహ్మేశ్వరరావు, శ్రీనివాస్, చింతనిప్పుడు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సత్యం పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు



వైరా, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో దొంతెబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం డివిజన్ కమిటీ సమావేశంలో నున్నా మాట్లాడారు. ప్రజల పక్షాన సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడంతో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. వర్షాకాలంలో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, గ్రామాల్లో రోడ్లు లేని ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. అన్ని మండలాల్లోని గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో యాత్రలు, పాదయాత్రలు చేపట్టాలని, ప్రజలను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరరావు, ఉమావతి, చింతనిప్పు చలపతిరావు, చెరుకుమల్లి కుటుంబరావు, తోట నాగేశ్వరరావు, అంబడి శ్రీనివాసరెడ్డి, బాదావత్ శ్రీనివాస్, బొజ్జా రామారావు, ఏర్పుల రాములు, దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు, బోయినపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగితే సమాచారం ఇవ్వాలి

- తల్లాడ ఎస్ఐ వెంకటకృష్ణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ

తల్లాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని తల్లాడ ఎస్ఐ ఎన్. వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు అవగాహనసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఆటోలలో కూలీలను అధికంగా ఎక్కించుకుని నడుపవద్దని నిబంధనలు మేరకే ప్రయాణీకులను ఎక్కించాలని తెలిపారు. ఇటీవల ప్రమాదాలు జరుగుతున్నప్పుడు సమాచారం ఇవ్వకుండా కొందరు భయపడుతున్నారని, అలా కాకుండా పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆటోడ్రైవర్లు తప్పకుండా అన్ని పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ట్రెయినీ ఎస్ఐ వెంకటేష్, పోలీసు సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

మళ్లీ మొదటికి..

(5వ పేజీ తరువాయి)

లారీల ఇసుకను తరలించినట్టు చెబుతున్నారు. పెద్ద మొత్తంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకునే వారే లేకపోవటం వెనుక ఉన్న లావాదేవీలేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పట్టుకున్నది ఎవరు.. వదిలింది ఎవరు?

సోమవారం రాత్రి పెద్ద సంఖ్యలో ఇసుక లారీలు సత్తుపల్లి పట్టణానికి చేరుకున్నాయని ప్రచారం జరిగింది. వీటిలో రెండు లారీలు మాత్రమే పట్టుబడ్డాయని, వాటిని రెండు గంటల వ్యవధిలో వదిలేశారనే ప్రచారం పట్టణంలో దావానంలా వ్యాపించింది. కొన్ని లారీలు ఏ ఆటంకం లేకుండా ఆంధ్రా ఇసుక అన్‌లోడ్ చేసి వెళ్లిపోగా ఆంధ్రా రిజిస్ట్రేషన్‌తో ఉన్న మరో రెండు లారీలను ఎవరు పట్టుకున్నారు? వాటిని ఎవరు వదిలేశారు? మధ్యలో ఏమి జరిగిందనే విషయం సత్తుపల్లి పట్టణంలో చర్చనీయంశంగా మారింది. మంగళవారం ఈ రెండు లారీల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.

నాగుపల్లి, గండుగులపల్లిలోనూ దాడులు..

ఆంధ్రా నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న సత్తుపల్లికి చెందిన ఒక వ్యక్తికి చెందిన అక్రమ ఇసుక లారీలను సోమవారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి, నాగుపల్లిలో పట్టుకున్నట్టు ప్రచారం జరిగింది. ఈ లారీలను సత్తుపల్లికి చెందిన ఒక శాఖ ఉద్యోగి వెళ్లి పట్టుకున్నారని, సత్తుపల్లి ఉద్యోగి వేరే జిల్లా వెళ్లి పట్టుకోవటంపై ఇసుక అక్రమ వ్యాపారులు సదరు ఉద్యోగితో వాగ్వాదానికి దిగినట్టు ప్రచారం జరగటంతో ఆ లారీలను దమ్మపేట మండల అధికారులకు అప్పగించినట్టు చర్చ జరుగుతోంది.

నాయకులను ఆశ్రయించిన అక్రమార్కులు

ఇసుక లారీలను సోమవారం రాత్రి పట్టుకున్న విషయంపై అక్రమార్కులు అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఒకరిని ఆశ్రయించినట్లు తెలిసింది. దీంతో సదరు నాయకుడు కూడా జరుగుతున్న పరిణామాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి కఠినంగా వ్యవహరించాలనుకుంటే అందరి పట్ల ఒకే రకంగా వ్యవహరించాలని కొన్ని వాహనాలు పట్టుకోవటం, వదిలేయటం, మరి కొన్ని స్వాధీనం చేసుకోవటమేమిటని వ్యాఖ్యానించినట్టు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లనున్నట్టు ఆ నాయకుడి అనుచరులు చెపుతున్నారు.

ఆది కర్మయోగి సేవా కేంద్రాల ప్రారంభం

కారేపల్లి సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాధారం, ఉసిరికాయలపల్లి, పేరుపల్లి గ్రామ పంచాయతీలలో ఆది కర్మయోగి సేవా కేంద్రాలను ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.విజయలక్ష్మీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు గ్రామలలో ర్యాలీలు నిర్వహించారు. ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆది కర్మయాగి పథకం రూ.10.5 కోట్లమంది గిరిజన ప్రజలను లక్ష్యంగా చేసుకుని 20లక్షల మంది శిక్షణ పొందిన కార్యకర్తల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేస్తుందన్నారు. ఏసీఎంవో ఎల్.రాములు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాలతి, పంచాయతీ కార్యదర్శులు నిరంజన్, విజయ్, సురేష్ పాల్గొన్నారు.

మెట్టాంజనేయ ఆలయ అధ్యక్షుడిగా శివ

సత్తుపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణ శివారులోని శ్రీ మెట్టాంజనేయస్వామి ఆలయ నూతన అధ్యక్షుడిగా టెంట్‌హౌస్ శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రధాన కార్యదర్శి మల్లూరు అంకంరాజు, కోశాధికారి గోగినేని వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడి చీపు సురేష్, జాయింట్ సెక్రటరీ అల్లాడి రాము, ఉప కోశాధికారి ముద్దు వెంకటరమణ, ప్రచార కార్యదర్శి కాసిని శ్రీను ప్రమాణస్వీకారం చేశారు.

జమలాపురంలో పారిశుధ్య పనులు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎర్రుపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక శోభనుకోల్పోతున్న స్వయంభూ క్షేత్రం అనే శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. రెండు నెలల దీర్ఘకాలిక విరామం తర్వాత ఆలయంలో గోత్రనామాలు, నిత్యపూజలు, శ్రీవారి కైంకర్య పూజలు, మంగళవాయిద్యాలు, వెంకటేశ్వర నామకీర్తనలు వినబడడంతో శ్రీదేవి శరన్నవరాత్రులు సందర్భంగా ఆలయం పరిసరాలు మంగళవారం ఆధ్మాత్మిక ఉల్లాసంతో నిండిపోయాయి. దేవాలయ పారిశుధ్య సిబ్బంది కొండపై, ఆలయ పరిసరాల్లో గడ్డి మందుపిచికారి చేసి పిచ్చి మొక్కలను తొలగించడం ప్రారంభించారు. సమస్యను వెలుగులోకి తెచ్చి ఆలయ అధికారులను మేల్కోల్పిని ఆంధ్రజ్యోతికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా భక్తుల నుంచి విమర్శలు వ్యతిరేకత రాకుండా తాత్కాలిక చర్యలు చేపట్టి ఆలయ అధికారులు చేతులు దులుపుకోకుండా ఆలయం చుట్టూ కారడవిలా పెరిగిన చెట్లను తొలిగించి గతంలో వలె మొక్కలతో శ్రీవారి తిరునామాలు, పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

గుంతలమయంగా తిమ్మరావుపేట రోడ్డు



బురదరాఘవాపురం సమీపంలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

ఏన్కూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు నుంచి తిమ్మరావుపేట వరకు సుమారు 12 కిమీ ప్రధాన రహదారి గుతంలమయంగా మారింది. మోకాలి లోతు అడుగడుగునా గుంతలతో అధ్వాన్న స్థితిలో ఉంది. ఈ రహదారిలో వాహనాలు ప్రయాణం నరకయాతనగా మారింది. రాత్రిపూట వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. ఈ గుంతల రహదారి వల్ల వాహనాలు దెబ్బతినడంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారి గుండా ఖమ్మం-ఇల్లెందుకు నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రహదారికి సంబంధిత ఆర్అండ్‌బీ శాఖా అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టకపోవడంతోపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తల్లాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వ్యాధులు వ్యాప్తి చెందుతున్న తరుణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష సూచించారు. మంగళవారం తల్లాడ మండలంలోని మల్లారం గ్రామంలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వాహణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జ్వరాల బారిన పడిన వారి నివాస గృహాలను సందర్శించి ఇళ్లల్లోని పాతటైర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగునీటిని తొలిగించారు. పల్లెదవాఖానా డాక్టర్ బి.శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్య, ఏఎన్ఎంలు అమృతరాజు, జ్యోతి, త్రివేణి పాల్గొన్నారు.

దుకాణాల ఎదుట ధరల బోర్డు ఉంచాలి

చింతకాని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల ఎదుట ధరల బోర్డులు తప్పకుండా ఏర్పాటు చేయాలని డీఏవో ధనసారి పుల్లయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ఎరువులు, పురుగుల మందు దుకాణాలను ఆయన తనఖీ చేశారు. దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. రైతులకు నాణ్యమైన పురుగు మందులు, ఎరువులు విక్రయించాలన్నారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేస్తున్నామని, రానున్న రోజుల్లో జిల్లాకు మరింత యూరియా రానుందన్నారు. ఏవో సోములపల్లి మానస, ఏఈవోలు ఆయేషా, రాము, తాహీయా, కార్తీక్ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

కొణిజర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలలో గుంతల మయంగా మారిన రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఐమాస్‌లైన్ నాయకులు పాశం అప్పారావు, తడికమళ్ల సీతారాములు, సునావత్ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. రహదారులపై వాహనాలు రద్దీగా ఉండడం వల్ల గుంతలతో అనుక్షణం ప్రమాదం నెలకొందని ప్రయాణీకులు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బతుకమ్మ ఘాటుకు వీధిలైట్ల ఏర్పాటు

వైరా, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైరాలోని రిజర్వాయర్ రోడ్డు నుంచి బతుకమ్మ ఘాట్ వరకు మునిసిపాలిటీ సిబ్బంది వీధిలైట్లను ఏర్పాటుచేశారు. విజయదశమి ఉత్సవాలను పురస్కరించుకొని మునిసిపల్ కమిషనర్ యు.గురులింగం పర్యవేక్షణలో మంగళవారం వీధిలైట్లు అమర్చారు. క్రాస్‌రోడ్డులోని జాతీయ ప్రధాన రహదారి నుంచి రిజర్వాయర్ రోడ్డులో అలాగే రిజర్వాయర్ ఆనకట్టపైన, బతుకమ్మ ఘాట్ వద్ద మొత్తం 35వీధిలైట్లను ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు క్రాస్‌రోడ్డులోని జాతీయ ప్రధాన రహదారి నుంచి రిజర్వాయర్ కుడికాల్వ హెడ్‌స్లూయిస్ వరకు మాత్రమే అరకొరగా వీధిలైట్లు ఉన్నాయి. ఇప్పుడు దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతిరోజూ మహిళలు బతుకమ్మలను రిజర్వాయర్‌లోని బతుకమ్మ ఘాట్‌లో నిమజ్జనం చేసుకోనేందుకు గానూ వీధిలైట్లను అమర్చారు.